


అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




సంపుటి - 3 సంచిక -115 శుక్రవారం 9 అక్టోబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు సాధనం

**దేశంలోని ప్రతీ జిల్లాకు 5జీ సేవలు విస్తరించాయన్న మోదీ**

**మొబైల్ ఇంటర్నెట్ వేగం 2022తో పోలిస్తే 10 రెట్లు పెరిగిందని వెల్లడి**

**డిజిటల్ ఇండియా ద్వారా సాంకేతిక అంతరాలను తగ్గించామన్న ప్రధాని**

**కోవిడ్ సమయంలో డిజిటల్ వ్యవస్థ దేశాన్ని నడిపించిందని వ్యాఖ్య**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 08(జర్నలిస్ట్ వార్త):**
భారత టెలికాం రంగం కేవలం నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రమ్, ఇంటర్నెట్ వేగానికే పరిమితం కాలేదని, సుపరిపాలన, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో మొబైల్ కనెక్టివిటీ ఒక కీలక శక్తిగా ఆవిర్భవించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. మిగతాది 2లో...

## నింగికెగిసిన నటదిగ్గజం

**బాలీవుడ్ నటుడు నానా పటేకర్ (75) గుండెపోటుతో కన్నుమూత**

**గోవాలోని తన నివాసంలో అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి తరలింపు**

**తెల్లవారుజామున 5:20 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు వెల్లడి**

**మూడు జాతీయ అవార్డులు, పలు ఫిలింఫేర్ పురస్కారాలు అందుకున్న నానా**

**'నటసామ్రాట్' చిత్రానికి ఉత్తమ నటుడిగా ఫిలింఫేర్ అవార్డు**


2లో.


2లో.

## కెనడా రచయిత్రి అన్నే కార్సన్‌కు సాహిత్య నోబెల్

**సరికొత్త సాహిత్య ప్రక్రియలను సృష్టించినందుకు ఈ గౌరవం**

# గోదావరి-కావేరి లింక్‌పై ప్రతిపాదనలు!

**ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ..**

**ప్రాజెక్టులకు సహాయం అందించాలని విజ్ఞప్తి**

**రాష్ట్ర అభివృద్ధిపై ప్రధానితో కీలక చర్చలు**

**పోలవరం, గోదావరి పుష్కరాలపై చర్చ**

**ఎల్‌నినో ప్రభావాన్ని వివరించిన సీఎం**

**నదుల అనుసంధానంపై ప్రతిపాదనలు**

**పోర్టుల అభివృద్ధికి 20 వేల ఎకరాలివ్వండి**

**20,378 ఎకరాల భూములు కేటాయించాలి**

**పంటల ఎగుమతులకు సహకరించాలి**





**పోలవరంవద్ద ఐకానిక్ వంతెనకు నిధులివ్వండి**

**బీచ్ రోడ్ ప్రాజెక్టుపై కేంద్రం దృష్టి సారించాలి**

**మంత్రి నితిన్ గడ్కరీతో భేటీలో సిఎం వినతి**

**కేంద్రానికి సిఎం చంద్రబాబు పలు విజ్ఞప్తులు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 08(జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం (అక్టోబర్ 08) ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి, ఆర్థిక పరిస్థితి, నీటిపారుదల, మౌలిక వసతులు, కరువు పరిస్థితులు సహా పలు కీలక అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. మిగతాది 2లో...

## పన్ను అధికారులకు అరెస్ట్ అధికారం రద్దు

**జీఎస్టీ రేట్లలో ఊరట.. ఈసారి లేని మార్పులు**

**57వ జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు!**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 08(జర్నలిస్ట్ వార్త):**
జీఎస్టీ కౌన్సిల్ గురువారం (అక్టోబర్ 08) ఢిల్లీలోని భారత్ మండపంలో ఒక ముఖ్యమైన సమావేశం నిర్వహించింది. ఈ కౌన్సిల్ ఒక కీలకమైన, చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, జీఎస్టీ కింద ఎటువంటి మిగతాది 2లో...

## ఐటీ దిగ్గజ కంపెనీలపై అమెరికా కొరడా..

### గ్రీన్ కార్డు ప్రక్రియ నిలిపివేత!

**మైక్రోసాఫ్ట్, అడోబ్‌తో పాటు ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి భారత ఐటీ కంపెనీల సస్పెన్షన్**

**పెర్మ్ సర్టిఫికేషన్ కార్యక్రమం నుంచి ఈ కంపెనీలను నిలిపివేస్తున్నట్లు ప్రకటన**

**అమెరికన్ ఉద్యోగులను తొలగించి విదేశీయులను నియమించుకుంటున్నారని ఆరోపణ**

**ప్రస్తుత హెచ్-1బీ వీసాలపై ప్రభావం లేదు, కానీ గ్రీన్ కార్డు దరఖాస్తులు నిలిపివేత**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 0(జర్నలిస్ట్ వార్త):**
అమెరికాలో పనిచేస్తున్న వేలాది మంది విదేశీ ఉద్యోగులకు, ముఖ్యంగా భారతీయులకు ట్రంప్ ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. హెచ్-1బీ వీసాలపై పనిచేస్తున్న ఉద్యోగులకు శాశ్వత నివాసం (గ్రీన్ కార్డు) కల్పించే ప్రక్రియలో కీలకమైన 'శాశ్వత కార్మిక ధ్రువీకరణ (పెర్మ్)' కార్యక్రమం నుంచి మైక్రోసాఫ్ట్, మిగతాది 2లో...

## జూరాల నీళ్లు వదిలిన రైతులపై కేసులు..

**వనపర్తి జిల్లాలో 14 మంది రైతులపై పోలీసులు కేసు నమోదు**

**పంటలు ఎండిపోతున్నా అధికారులు స్పందించకపోవడంతో గేట్లు ఎత్తిన రైతులు**

**ఇరిగేషన్ డీఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడి**

**నీటి కోసం ధర్నా చేసిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై కూడా కేసులు**



**వనపర్తి (జర్నలిస్ట్ వార్త):**
సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయన్న ఆవేదనతో, జూరాల ప్రాజెక్టు కాలువకు బలవంతంగా నీటిని విడుదల చేసిన 14 మంది రైతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వనపర్తి జిల్లా అమరచింత పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సాగునీటి పారుదల శాఖ డిప్యూటీ ఇంజినీర్ (డీఈ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై స్వాతి గురువారం వెల్లడించారు.. మిగతాది 2లో...

# రేపు రిజర్వేషన్లు కూడా తీసేస్తారు

### ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలో సీఎం రేవంత్

**ఓటమి భయంతో పేదల ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర అంటూ రేవంత్ ఫైర్**

**ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణకు బీజేపీ ప్లాన్ అంటూ ఆరోపణలు**

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్**

**ఓట్లు తీసేస్తే రేపు రిజర్వేషన్లు కూడా తీసేస్తారని హెచ్చరిక**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 08(జర్నలిస్ట్ వార్త):**
ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. మిగతాది 2లో...

## 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో ఉద్రిక్తత..

**హైదరాబాద్‌లో ఇండియా కూటమి 'చలో లోక్‌భవన్' ర్యాలీ.**

**లోక్‌భవన్ వద్ద పోలీసుల బారికేడ్లు పొన్నం, మహేశ్ గౌడ్ సహా నేతల అరెస్ట్**



## బ్యాలెట్ పేపర్ల విధానంలోనే స్థానిక ఎన్నికలు

**సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే స్థానిక ఎన్నికలు: ఏపీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్**

**జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్**

**స్థానిక ఎన్నికలకు అధికారం యంత్రాంగం సిద్ధంగా ఉందని వెల్లడి**



**అమరావతి అక్టోబర్ 08(జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులతో మిగతాది 2లో...



## రైతులకు బేడీలా?

**కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఆగ్రహం**

**జూరాల నీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు నమోదు**

**ఇది ప్రజా పాలన కాదు, ప్రజా పీడన అంటూ విమర్శలు**

**హైదరాబాద్ (జర్నలిస్ట్ వార్త):**
రైతులపై కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ లేదంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక పంటలు కాపాడుకునేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, . మిగతాది 2లో...

# మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు సాధనం

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలో ప్రారంభమైన 10వ 'ఇండియా మొబైల్ కాంగ్రెస్' (ఐఎంసీ) 2026 సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత దశాబ్ద కాలంలో మొబైల్ ఫోన్లు సాధారణ కమ్యూనికేషన్ పరికరాల స్థాయి నుంచి సుపరిపాలనను అందించే ముఖ్యమైన సాధనాలుగా రూపాంతరం చెందాయని అన్నారు. 'మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు ఒక సాధనంగా మారింది' అని ఆయన పేర్కొన్నారు. భారత టెలికాం ప్రస్థానంలో ఇండియా మొబైల్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని ప్రధాని గుర్తుచేశారు. "2022లో ఇదే వేదికపై దేశంలో 5జీ సేవలను ప్రారంభించాం. 2023 నాటికి 5జీని దేశవ్యాప్తంగా విస్తరింపజేయడంలో ముందడుగు వేశాం. ఈ రోజు దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ కనెక్టివిటీ చేరింది. ప్రస్తుతం దేశంలో 5.5 లక్షలకు పైగా 5జీ బేస్ స్టేషన్లు పనిచేస్తున్నాయి. 2022తో పోలిస్తే మొబైల్ ఇంటర్నెట్ వేగం 10 రెట్లు పెరిగింది" అని ప్రధాని వివరించారు. ఒక దశాబ్దం క్రితం దేశంలో 'డిజిటల్ విభజన' ఒక పెద్ద సవాలుగా ఉండేదని, కొత్త సాంకేతికత కొందరికే దక్కేదని మోదీ గుర్తుచేశారు. ఈ సమస్యను అధిగమించేందుకే 'డిజిటల్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించామని, మొబైల్ ఫోన్‌ను కేంద్రంగా చేసుకుని డిజిటల్ సేవలను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చామని వివరించారు. భారతీయులకు టెలికాం అంటే కేవలం సాంకేతికత మాత్రమే కాదని, అంతకు మించి అని ఆయన అన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో భారత డిజిటల్ వ్యవస్థ ప్రాముఖ్యతను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో కార్యకలాపాలు స్తంభించిపోయినప్పుడు కూడా, మన దేశంలో కార్యాలయాలు, బ్యాంకులు, విద్యా సంస్థలు డిజిటల్ మౌలిక సదుపాయాల వల్లే నిరంతరాయంగా పనిచేయగలిగాయని గుర్తుచేశారు. ఈ ఏడాది ఐఎంసీ థీమ్ 'సరిహద్దులు లేని విస్తరణ' అని, ఇది భారత టెలికాం, డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుందని మోదీ అన్నారు. అక్టోబర్ 7 నుంచి 10 వరకు జరగనున్న ఈ సదస్సును టెలికమ్యూనికేషన్స్ విభాగం, సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన దేశ, విదేశీ టెలికాం ఆపరేటర్లు, పరిశ్రమల అధిపతులు, నిపుణులు, స్టార్టప్ ప్రతినిధులకు ప్రధాని స్వాగతం పలికారు.

# బ్యాలెట్ పేపర్ల విధానంలోనే స్థానిక ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గత రెండు నెలలుగా ఎన్నికల ఏర్పాట్లపై కసరత్తు చేస్తున్నామని, అధికారులు అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నారని వివరించారు. ఈ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ల విధానంలోనే నిర్వహిస్తామని ఆయన తెలిపారు. 2026 ఫిబ్రవరి 5వ తేదీ నాటి ఫొటో ఓటర్ల జాబితాను ఈ ఎన్నికలకు ప్రామాణికంగా తీసుకోనున్నట్లు వెల్లడించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణకు అవసరమైన ప్రింటింగ్ ప్రెస్‌ను కూడా త్వరలో ఖరారు చేయనున్నట్లు తెలిపారు.

# రేపు రిజర్వేషన్లు కూడా తీసేస్తారు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది. ఇప్పుడు ఓటమి ఖాయమని తేలడంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. అయితే, దీనికి భారత ప్రజలు అంగీకరించరు," అని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమిది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన అన్నారు. బ్రిటిష్ వారి 'విభజించు-పాలించు' ఎత్తుగడలతో ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. "ఈ రోజు ప్రజల ఓట్లను చట్టవిరుద్ధంగా లాక్కుంటే, రేపు వారి రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కూడా లాక్కుంటారు. బీజేపీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి. లేదంటే ఆ పార్టీ భారత రాజకీయ చరిత్రలో చెత్తబుట్టలో కలిసిపోతుంది," అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

# రైతులకు బేడీలా?

మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఇది ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని, అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' ఖాతా వేదికగా స్పందించారు. "కళ్ల ముందే ఎండుతున్న పంటలకు నీరివ్వమని అడిగిన రైతులపై కేసులు పెట్టడం సిగ్గుచేటు. రేవంత్ రెడ్డి పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారింది" అని హరీశ్ రావు విమర్శించారు. వారి చేతగానితనం వల్ల పంటలకు నీరందకపోతే, కడుపు మండి నిలదీసిన రైతులపై అక్రమ కేసులు బనాయిస్తారా? అని ప్రశ్నించారు. కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించి, ఇప్పుడు రైతులను శిక్షిస్తున్నారని ఆరోపించారు. "ఇది ప్రజా పాలన కాదు. ప్రజా పీడన. తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా?" అని హరీశ్ రావు నిలదీశారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# జూరాల నీళ్లు వదిలిన రైతులపై కేసులు..

సాగునీరు విడుదల చేయకపోవడంతో తమ పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయని రైతులు గత కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడంతో, గత నెల సెప్టెంబర్ 19వ తేదీ సాయంత్రం వారే నేరుగా జూరాల ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తి కాలువ ద్వారా తమ పొలాలకు నీటిని విడుదల చేసుకున్నారు. సెప్టెంబర్ 19, 20 తేదీల్లో చోటుచేసుకున్న ఈ పరిణామాలపై ఇరిగేషన్ డీఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగానే రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇదే వ్యవహారంలో మరికొందరిపై కూడా కేసులు నమోదయ్యాయి. జూరాల ప్రాజెక్టు నుంచి తక్షణమే సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 21వ తేదీన జమ్మిచేడు వద్ద ధర్నా నిర్వహించిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై కూడా కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో ఉద్రిక్తత..

**హైదరాబాద్‌లో ఇండియా కూటమి 'చలో లోక్‌భవన్' ర్యాలీ.**

**లోక్‌భవన్ వద్ద పోలీసుల బారికేడ్లు పొన్నం, మహేశ్ గౌడ్ సహా నేతల అరెస్ట్**

'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండీ కూటమి హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఛలో లోక్‌భవన్' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ వరకు కూటమి నేతలు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. లోక్‌భవన్ వద్దకు ర్యాలీ చేరుకున్న సమయంలో పోలీసులు భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి నేతలను ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, కూటమి నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. కొంతసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వేం నరేందర్‌రెడ్డి తదితరులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని డీసీఎంలో తరలించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై ఇండియా కూటమి అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా 'సేవ్ డెమోక్రసీ' కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అక్టోబర్ 2 నుంచి 8 వరకు నిరసనలు చేపట్టాలని కూటమి గతంలో కార్యాచరణ రూపొందించింది.

మరోవైపు ఢిల్లీలోనూ ఇండియా కూటమి తదుపరి కార్యాచరణపై దృష్టి పెట్టింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో కూటమి నేతలకు విందు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో మరో నిరసన చేపట్టే అవకాశం ఉందని సమాచారం.

# నింగికెగిసిన నట దిగ్గజం

**బాలీవుడ్ నటుడు నానా పటేకర్ (75)**

**గుండెపోటుతో కన్నుమూత**




**న్యూఢిల్లీ, అక్టోబర్ 08 (జర్నలిస్ట్ వార్త):**
భారతీయ సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విలక్షణ నటనకు చిరునామాగా నిలిచిన ప్రముఖ నటుడు నానా పటేకర్ (75) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. గోవాలోని తన నివాసంలో ఆయనకు తీవ్రమైన గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 5:20 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు ఆసుపత్రి వర్గాలు ధ్రువీకరించాయి. ఆసుపత్రికి తీసుకొచ్చిన తర్వాత దాదాపు 45 నిమిషాల పాటు వైద్యులు ఆయనను బతికించేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, అయినప్పటికీ వారి ప్రయత్నాలు ఫలించలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన మరణవార్తతో చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. 1978లో 'గమన్' చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన నానా పటేకర్, తన విలక్షణమైన నటన, డైలాగ్ డెలివరీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'పరిందా', 'అబ్ తక్ ఛప్పన్', 'యశ్వంత్', 'వజూద్' వంటి చిత్రాలతో ఆయన నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా 2000 తర్వాత 'శక్తి: ది పవర్', 'అపహరణ్', 'టాక్సీ నెం 9211' వంటి సినిమాల్లో ఆయన నటన విమర్శకుల మన్ననలు పొందింది. ఒకవైపు సీరియస్ పాత్రలతో అలరిస్తూనే, మరోవైపు కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. 'వెల్కమ్' (2007), 'వెల్కమ్ బ్యాక్' (2015) చిత్రాలలో ఆయన పోషించిన 'ఉదయ్ శెట్టి' పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది. 'రాజ్‌నీతి' చిత్రంలో ఆయన నటనకు ఫిలింఫేర్ అవార్డుకు నామినేట్ అయ్యారు. తన అద్భుత నట ప్రస్థానంలో మూడు జాతీయ అవార్డులను అందుకున్నారు. 2016లో మరాఠీ చిత్రం 'నటసామ్రాట్'లో ప్రదర్శించిన అసమాన నటనకు గాను ఆయన ఫిలింఫేర్ ఉత్తమ నటుడి పురస్కారాన్ని గెలుచుకున్నారు. నటుడిగానే కాకుండా 'యశ్వంత్', 'వజూద్', 'ఆంచ్' వంటి చిత్రాల్లో నేపథ్య గాయకుడిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. నానా పటేకర్ మృతితో భారతీయ సినిమా ఓ గొప్ప నటుడిని కోల్పోయిందని పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# గోదావరి-కావేరి లింక్‌పై ప్రతిపాదనలు!

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా గోదావరి--కావేరి నదుల అనుసంధానాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం చొరవ తీసుకోవాలని కోరారు. భేటీ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా మోదీ అందించిన సేవలను ప్రస్తావిస్తూ.. దూరదృష్టి, నిర్ణయాత్మక నాయకత్వం, సుపరిపాలనతో దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేసుకుని వికసిత్ భారత్ లక్ష్యం వైపు దేశాన్ని నడిపిస్తున్నారని చంద్రబాబు అభినందించారు. గోదావరి వరద జలాల్లో కొంత భాగాన్ని సమర్థంగా వినియోగించి దక్షిణాది రాష్ట్రాల నీటి అవసరాలను తీర్చేలా నదుల అనుసంధానంపై సాంకేతిక అధ్యయనం చేపట్టాలని చంద్రబాబు ప్రతిపాదించారు. గోదావరి--కావేరి అనుసంధానం పూర్తయితే ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ప్రస్తుతం గోదావరి నుంచి సముద్రంలోకి భారీగా నీరు వెళ్లిపోతున్న నేపథ్యంలో ఈ నీటిని సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించే మార్గాలను పరిశీలించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు పురోగతి, నిర్మాణం, పునరావాస పనులపైనా చంద్రబాబు వివరాలు అందించారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాష్ట్రంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, దీనికి కేంద్రం ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని ప్రధానిని కోరారు. 2027 గోదావరి పుష్కరాలు జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరగనున్నాయి. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఘాట్లు, రహదారులు, పారిశుద్ధ్యం, భద్రత తదితర మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం లోటు ఏర్పడి వ్యవసాయ రంగంపై ప్రభావం పడిందని చంద్రబాబు ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. 2026 ఖరీఫ్ సీజన్‌లో 21 జిల్లాల్లోని 388 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. జూన్ నుంచి ఆగస్టు మధ్య సాధారణ వర్షపాతంతో పోలిస్తే 53.4 శాతం లోటు నమోదైనట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో కరువు నివారణ, రైతులకు ఉపశమన చర్యల కోసం ప్రత్యేక కేంద్ర సాయం అందించాలని సీఎం కోరారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్, విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ వంటి కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు, ఆర్థిక సహకారం అందించాలని చంద్రబాబు కోరారు. విశాఖ మెట్రో, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు ఆమోదం కోసం ప్రధాని వద్ద ప్రతిపాదనలు ఉంచనున్నట్లు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. అదే సమయంలో రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్, వ్యవసాయ రంగంలో కొత్త సంస్థల ఏర్పాటు, బాహ్య సహాయంతో అమలవుతున్న ప్రాజెక్టులకు కేంద్ర వాటా వంటి అంశాలపైనా సీఎం చర్చించారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన పలు కీలక అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లిన ఈ భేటీలో.. ముఖ్యంగా నీటి సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారంగా గోదావరి--కావేరి అనుసంధానానికి కేంద్రం నుంచి వచ్చే స్పందనపై ఆసక్తి నెలకొంది. అంతకుముందు ఆంధ్రప్రదేశ్‌లో పోర్టు ఆధారిత పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి రాష్ట్రంలోని సుమారు 20,378 ఎకరాల ఉప్పు భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కోరారు. తన ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురోభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ప్రభుత్వ పరిశ్రమల ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య విభాగం పరిధిలో ఉన్న ఉప్పు భూములను రాష్ట్రానికి కేటాయించడం ద్వారా పోర్టుల విస్తరణ, అనుబంధ మౌలిక సదుపాయాల కల్పన సులభతరం అవుతుందని ముఖ్యమంత్రి వివరించారు. పోర్టు ఆధారిత పారిశ్రామిక ప్రాజెక్టుల కోసం ఈ భూములను వినియోగించుకోవడానికి వీలుగా బదలాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. పోర్టులకు అవసరమైన కనెక్టివిటీ రోడ్లు, రైల్వే లైన్లు, ఇతర పారిశ్రామిక కార్యకలాపాలకు ఈ భూములు అత్యంత కీలకమని, దీనిపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పంపామని ఆయన గుర్తుచేశారు. ఇదే సమావేశంలో రాష్ట్ర రైతుల ప్రయోజనాలపైనా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో రైతులు పండిస్తున్న మిర్చి, పొగాకు, ఆక్వా వంటి వాణిజ్య ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో విశేషమైన ఆదరణ ఉందని, వాటి ఎగుమతులను ప్రోత్సహించేందుకు కేంద్ర వాణిజ్య శాఖ తగిన సహకారం అందించాలని కోరారు. ఈ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలను కల్పించడంతో పాటు, నాణ్యతా ప్రమాణాల పెంపుదల, ప్రాసెసింగ్ సదుపాయాలు బలోపేతానికి కేంద్రం చేయూతనివ్వాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి అభ్యర్థనలపై కేంద్రమంత్రి పీయూష్ గోయల్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు, నిధులు, అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ ఆయన విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ప్రధానంగా, రాజధాని అమరావతి అభివృద్ధికి గుండెకాయ వంటి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు 189 కిలోమీటర్ల పొడవుతో ప్రతిపాదించిన ఈ ఓఆర్ఆర్, రాజధాని ప్రాంత అభివృద్ధిలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందని ముఖ్యమంత్రి వివరించారు. అమరావతి, విజయవాడ పరిసర ప్రాంతాల్లో భవిష్యత్తులో పెరిగే రవాణా అవసరాలను తీర్చడంలో ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని ఆయన కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దోహదపడే మరికొన్ని కీలక ప్రాజెక్టులను కూడా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాష్ట్ర జీవనాధారమైన పోలవరం ప్రాజెక్టు వద్ద ఎడమ, కుడి గట్లను అనుసంధానిస్తూ ఒక 'ఐకానిక్' వంతెన నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. ప్రాజెక్టుకు అనుబంధంగా అవసరమైన రహదారులు, ఇతర వంతెనల నిర్మాణానికి సైతం కేంద్రం తోడ్పాటునందించాలని విన్నవించారు. రాష్ట్ర తీరప్రాంత అభివృద్ధికి, పర్యాటక, పారిశ్రామిక కనెక్టివిటీని పెంచేందుకు బీచ్ రోడ్ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించాలని చంద్రబాబు కోరారు. ఈ రహదారి నిర్మాణం ద్వారా తీరప్రాంత నగరాలు, ఓడరేవులు, పర్యాటక కేంద్రాల మధ్య అనుసంధానం మరింత మెరుగుపడుతుందని ఆయన వివరించారు.

# ఐటీ దిగ్గజ కంపెనీలపై అమెరికా కొరడా..

(మొదటి పేజీ తరువాయి)

అడోబ్‌తో పాటు పలు భారత ఐటీ దిగ్గజ కంపెనీలను సస్పెండ్ చేస్తున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ జాబితాలో కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, క్యాప్‌జెమినీ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి.

ఈ నిర్ణయంతో అమెరికా కార్మిక శాఖ ఇకపై ఈ కంపెనీల నుంచి కొత్త పెర్మ్ దరఖాస్తులను స్వీకరించదు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలించదు. అయితే, ఈ చర్యల ప్రభావం ప్రస్తుత హెచ్-1బీ వీసాలపై ఉండదని, కేవలం గ్రీన్ కార్డు మంజూరు ప్రక్రియపైనే ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ కంపెనీలలో పనిచేస్తున్న విదేశీయులు గ్రీన్ కార్డు పొందడం ఇకపై దాదాపు అసాధ్యంగా మారనుంది. ఈ సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ, ముఖ్యంగా మైక్రోసాఫ్ట్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. "అమెరికాలో ఈ వ్యవస్థను మైక్రోసాఫ్ట్ కంటే ఎక్కువగా ఎవరూ దుర్వినియోగం చేయలేదు. ఆ సంస్థ సుమారు 6,000 మంది అమెరికన్ ఉద్యోగులను తొలగించి, దాదాపు 6,300 హెచ్-1బీ వీసాలు, 3,000 గ్రీన్ కార్డులు పొందింది. ఇది అమెరికన్ల స్థానంలో విదేశీ బానిసలను నియమించుకోవడమే" అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. కార్మిక శాఖ కార్యదర్శి కీత్ సోండర్‌లింగ్ మాట్లాడుతూ, 2009 నుంచి ఈ కంపెనీలు దాదాపు 30 లక్షల మంది విదేశీ కార్మికుల కోసం దరఖాస్తు చేసుకున్నాయని, వాటిలో 2,30,000 హెచ్-1బీ వీసాలు, లక్షకు పైగా పెర్మ్ సర్టిఫికేషన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సంస్థలు మోసాలకు పాల్పడుతూ, తక్కువ వేతనాలకు విదేశీయులను నియమించుకుని అమెరికన్ల ఉద్యోగాలను దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే సబ్‌పోనలు జారీ చేశామని, పలు ఫెడరల్ ఏజెన్సీలు దర్యాప్తు చేస్తున్నాయని వెల్లడించారు. మరోవైపు, విద్యార్థి వీసాల దుర్వినియోగం ఆరోపణలపై హార్వర్డ్, యేల్, స్టాన్‌ఫోర్డ్ సహా తొమ్మిది విశ్వవిద్యాలయాలపై కూడా ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించినట్లు ప్రకటించారు.

**ఏమిటీ పెర్మ్ ప్రోగ్రాం?**

అమెరికాలో ఒక విదేశీ ఉద్యోగికి గ్రీన్ కార్డు స్పాన్సర్ చేయాలంటే, సదరు ఉద్యోగానికి తగిన నైపుణ్యం, అర్హతలున్న అమెరికన్ పౌరులు ఎవరూ అందుబాటులో లేరని యజమాని నిరూపించాలి. దీనికోసం చేపట్టే ప్రక్రియే పెర్మ్. ఇది ఆమోదం పొందాకే గ్రీన్ కార్డు కోసం తదుపరి దశ అయిన ×-140 పిటిషన్‌ను దాఖలు చేయడానికి వీలవుతుంది. తాజా సస్పెన్షన్‌తో ఈ కంపెనీలకు ఆ మార్గం మూసుకుపోయింది. ఈ నిషేధం ఎప్పటివరకు కొనసాగుతుందనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.

# కెనడా రచయిత్రి అన్నే కార్సన్‌కు సాహిత్య నోబెల్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 08 (జర్నలిస్ట్ వార్త):**
సంప్రదాయ సాహిత్యంతో సరదాగా సంభాషిస్తూనే, సమకాలీన సాహిత్యం కోసం సరికొత్త రూపాలను సృష్టించిన ఆమె సాహసోపేతమైన, సృజనాత్మక రచనలకు ఈ పురస్కారం అందజేస్తున్నట్టు స్వీడిష్ అకాడమీ తన ప్రకటనలో ప్రశంసించింది. 1950లో టొరంటోలో జన్మించిన అన్నే కార్సన్, కవిత్వం, అనువాదం, క్లాసికల్ స్కాలర్‌షిప్ వంటి విభిన్న రంగాలను తన రచనల్లో అద్భుతంగా మిళితం చేశారు. 1981లోనే ఆమె క్లాసిక్స్‌లో డాక్టరల్ థీసిస్ పూర్తి చేయడం ఆమె పాండిత్యానికి నిదర్శనం. సాహిత్యంలోని ప్రక్రియల మధ్య ఉన్న సరిహద్దులను చెరిపేయడం ఆమె ప్రత్యేకత. పదాల పుట్టుక నుంచి తన రచనలను ప్రారంభించడం ఆమె శైలిలో ఒక ముఖ్యమైన అంశం.

'ది గ్లాస్ ఎస్సే' (1995), 'ది బ్యూటీ ఆఫ్ ది హజ్బెండ్' (2001) వంటివి ఆమె ప్రయోగాత్మక రచనలకు కొన్ని ఉదాహరణలు. పలు విశ్వవిద్యాలయాల్లో బోధించిన కార్సన్, తెలికైన, ప్రయోగాత్మక శైలితో రచనల్లోని సరికొత్త అవకాశాలను అన్వేషించడంలో ప్రసిద్ధి చెందారు. ఈ పురస్కారం కింద ఆమెకు 12 మిలియన్ల స్వీడిష్ క్రోనార్ల (సుమారు 1.2 మిలియన్ డాలర్లు/రూ. 11.62 కోట్లు) నగదు బహుమతి లభించనుంది. డిసెంబర్ 10న జరిగే అధికారిక కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేస్తారు. కాగా, గతేడాది (2025) హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్నహోర్కై ఈ పురస్కారాన్ని అందుకున్న విషయం తెలిసిందే.

# పన్ను అధికారులకు అరెస్ట్ అధికారం రద్దు

(మొదటి పేజీ తరువాయి)

అరెస్టులు జరగవు. జీఎస్టీ కింద అరెస్టు చేసే అధికారాన్ని కౌన్సిల్ పూర్తిగా తొలగించింది. అలాగే, ప్రాసిక్యూషన్ పరిమితిని రూ. 1 కోటి నుండి రూ. 5 కోట్లకు పెంచింది. జీఎస్టీ విధానంలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక సంస్కరణకు శ్రీకారం చుట్టింది. ఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను చెల్లింపుదారులకు సంబంధించిన అమలు, ప్రాసిక్యూషన్ నిబంధనలపై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా జీఎస్టీ అధికారులకు ఉన్న అరెస్ట్ అధికారాలను తొలగిస్తూ.. కౌన్సిల్ నిర్ణయించింది. దీంతో జీఎస్టీ ఉల్లంఘనలకు సంబంధించి పన్ను అధికారులు నేరుగా అరెస్ట్ చేసే అవకాశం ఇక ఉండదు. ఇప్పటివరకు తీవ్రమైన పన్ను ఎగవేత, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వంటి కొన్ని కేసుల్లో జీఎస్టీ అధికారులు అరెస్ట్ చేసే అధికారం ఉంది. ఈ అధికారాన్ని పరిమితం చేయడం ద్వారా సాధారణ పన్ను వివాదాలు, వ్యాపార సంబంధిత పొరపాట్లు క్రిమినల్ చర్యల స్థాయికి వెళ్లకుండా చూడాలనే ఉద్దేశంతో సంస్కరణలు తీసుకొచ్చింది కేంద్రం. పన్ను బకాయిల వసూలు, వడ్డీ, జరిమానాల విధింపు వంటి ఇతర చర్యలు మాత్రం కొనసాగుతాయి. అదే సమయంలో జీఎస్టీ కింద ప్రాసిక్యూషన్ ప్రారంభించే పరిమితిని కూడా భారీగా పెంచారు. ఇప్పటివరకు రూ.1 కోటి పన్ను ఎగవేతకు సంబంధించిన కేసుల్లో ప్రాసిక్యూషన్ ప్రారంభించే అవకాశం ఉండగా.. ఇకపై ఆ పరిమితిని రూ.5 కోట్లకు పెంచారు. అంటే రూ.5 కోట్లకు లోబడిన పన్ను ఎగవేత కేసుల్లో క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు వెళ్లే అవకాశం తగ్గనుంది. ఈ మార్పులను పన్ను వ్యవస్థను మరింత సులభతరం చేయడం, వ్యాపార సంస్థలపై అనవసరమైన చట్టపరమైన ఒత్తిడిని తగ్గించడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మెరుగుపరచడం వంటి లక్ష్యాలతో కొత్త సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. జీఎస్టీ 2.0లో భాగంగా కేవలం అరెస్ట్, ప్రాసిక్యూషన్ నిబంధనలే కాకుండా.. రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడం, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వ్యవస్థలో మార్పులు, రిఫండ్లను వేగవంతం చేయడం, వివాదాలను తగ్గించడం వంటి పలు అంశాలపై కూడా కౌన్సిల్ దృష్టి సారించింది.

# ప్రజల కోరిక మేరకు ఆరోగ్య పరీక్షలు

## 5వ వార్డులో ఉచిత రక్తపోటు, మధుమేహ పరీక్షలు




**తల్లాడ/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** గ్రామసభలో ప్రజలు కోరిన మేరకు తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 5వ వార్డులో గురువారం ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజా ఆరోగ్య శాఖ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రజలకు రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామసభలో ప్రజలు కోరిన ఆరోగ్య పరీక్షలను వార్డులో నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు గ్రామపంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.
డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే సకాలంలో వైద్య సలహాలు, చికిత్స పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో 5వ వార్డు సభ్యురాలు గుంటుపల్లి కుమారి, సొసైటీ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, సహాయక నర్సులు, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 33 ఏళ్లుగా ప్రజల గుండెల్లో దొడ్డ కృష్ణయ్య

## ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం -సండ్ర వెంకట వీరయ్య




**తల్లాడ/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):**
పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం జీవితాంతం పోరాడిన అమరజీవి కామ్రేడ్ దొడ్డ కృష్ణయ్య ఆశయాలు నేటికీ స్ఫూర్తిదాయకమని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకట వీరయ్య అన్నారు. అన్నారుగూడెంలోని దొడ్డ కృష్ణయ్య స్వగ్రామంలో బుధవారం నిర్వహించిన ఆయన 33వ వర్ధంతి సభలో సండ్ర మాట్లాడారు. మూడు దశాబ్దాలకు పైగా కాలం గడిచినా దొడ్డ కృష్ణయ్యను ప్రజలు గుండెల్లో పదిలంగా ఉంచుకోవడం ఆయన చేసిన ప్రజాసేవకు నిదర్శనమన్నారు. వర్ధంతి సభకు భారీగా తరలివచ్చిన ప్రజలే ఆయనపై ఉన్న అభిమానానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పేదల పక్షాన నిలిచిన దొడ్డ కృష్ణయ్య.. సీపీఎం కార్యకర్తగా వివిధ హోదాల్లో పనిచేస్తూ ప్రజా ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు.

### ఆశయాల బాటలో శ్రీనివాసరావు

దొడ్డ కృష్ణయ్య ఆశయాలను ఆచరణలో పెడుతూ తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు ప్రజాజీవితంలో ముందుకు సాగుతున్నారని సండ్ర వెంకట వీరయ్య అన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. తండ్రి ఆశయాలు, అన్న దొడ్డ కృష్ణయ్య ప్రజాసేవా స్ఫూర్తిని తన రాజకీయ ప్రస్థానానికి మార్గదర్శకంగా చేసుకున్నారని పేర్కొన్నారు. దొడ్డ కృష్ణయ్య ఆశయాలకు వారసుడిగా శ్రీనివాసరావు కొనసాగుతున్నారని అన్నారు.

### ప్రభుత్వంపై విమర్శలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సండ్ర విమర్శించారు. అభివృద్ధి కనిపించడం లేదని, హామీల అమలుపై ప్రశ్నిస్తే అరెస్టులు, పోలీసు కేసులు, నిర్బంధాలతో అణచివేతకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.
అంతకుముందు దొడ్డ కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 'దొడ్డ కృష్ణయ్య అమర్ హై' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్‌లాల్, మాజీ సర్పంచ్ కోసూరి వెంకట నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అరెస్టుపై కాంగ్రెస్ భగ్గుమంది

## మిర్యాలగూడలో భారీ నిరసన ర్యాలీ.. కేంద్ర ప్రభుత్వ తీరుపై నాయకుల ఆగ్రహం




**మిర్యాలగూడ/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** ఢిల్లీలో నిర్వహించిన 'సేవ్ డెమోక్రసీ-ఓట్ బచావో-దేశ్ బచావో' కార్యక్రమంలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) పాల్గొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేస్తున్న ప్రతిపక్ష నాయకుడిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని బీఎల్ఆర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రజల ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను, ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువజన నాయకులు, బీఎల్ఆర్ బ్రదర్స్ సభ్యులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో నాణ్యమైన విద్య

## నాణ్యతలో ఎక్కడా రాజీ వద్దు -నిర్మాణ పనులను వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





**హసన్‌పర్తి/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట నియోజకవర్గంలోని గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యా వసతులు అందించడమే లక్ష్యంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి క్రాస్ వద్ద నిర్మిస్తున్న పాఠశాల నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. సుమారు 16 ఎకరాల 11 గుంటల విస్తీర్ణంలో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న పాఠశాల ప్రాంగణంలో చేపట్టాల్సిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులతో కలిసి సమీక్షించారు.
పాఠశాల భవన నిర్మాణం, మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలు, నిర్మాణ ప్రణాళికపై అధికారులను ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత ప్రణాళిక ప్రకారం పనులను వేగవంతం చేయాలని సూచించారు. నిర్మాణంలో ఎక్కడా నాణ్యతా లోపాలకు తావివ్వకుండా నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.

### అసెంబ్లీలో ప్రస్తావనతో భూమి కేటాయింపు

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు సంబంధించి ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో తాను సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. దీనిపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి పాఠశాల నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించారని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా ఆధునిక విద్యతో పాటు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాల అందుబాటులోకి వస్తే నియోజకవర్గంలోని విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు మరింత చేరువ అవుతాయని అన్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నల్లమల్ల ప్రశాంత్ వర్ధంతి సందర్భంగా అన్నదానం

## మానసిక దివ్యాంగ పిల్లలకు సంపూర్ణ భోజనం వితరణ




**మధిర/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్‌కు చెందిన నల్లమల్ల ప్రశాంత్ మూడో వర్ధంతి సందర్భంగా ఆయన తండ్రి నల్లమల్ల పార్థసారథి ఆధ్వర్యంలో గురువారం మధిరలోని మదర్ థెరిస్సా సేవా సదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలోని పిల్లలకు సంపూర్ణ భోజనం ఏర్పాటు చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని మధిర సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ పరేష్ కుమార్ మిశ్రా, పీవీఆర్ అండ్ ఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పారుపల్లి వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఎంపీడీవో, సామాజిక సేవకులు మాధవరపు నాగేశ్వరరావు, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ రమావత్ బాబురావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవా సదనం నిర్వాహకురాలు నల్లపు స్వర్ణలత మాట్లాడుతూ మానసిక దివ్యాంగ పిల్లలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం చికెన్ బిర్యానీ, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మంచి మనసుతో అన్నదానం చేసిన నల్లమల్ల పార్థసారథి, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది సమాజ సేవలో భాగస్వాములు కావాలని కోరారు. నల్లమల్ల ప్రశాంత్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని మానసిక దివ్యాంగ పిల్లల తరఫున దేవుడిని ప్రార్థిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రశాంత్ వర్ధంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ దివ్యాంగ పిల్లలకు అన్నదానం చేసిన కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా న్యాయవాదుల రాస్తారోకో




**ఖమ్మం/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పట్ల అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఖమ్మం కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని, అక్రమ అరెస్టులను ఖండించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బీజేపీ డౌన్ డౌన్ అంటూ నినదిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు
ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది స్వామి రమేష్ కుమార్ మాట్లాడుతూ ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డిపై జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధులపై దాడులు జరగడం ఆందోళనకరమన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే ప్రజాప్రతినిధుల గొంతును అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు
సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత జవాబుదారీతనం నిష్పాక్షికత ఉండాలని కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు
ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ అధ్యక్షుడు తాళ్లూరి దిలీప్ చౌదరి నిరసనకు మద్దతు తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులు రాజ్యాంగ విలువల పరిరక్షణకు న్యాయవాదులు తమ వంతు బాధ్యతగా నిలబడాలని అన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు ప్రయోజనాలను గౌరవించాలని ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కాపాడాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు
కార్యక్రమంలో కాంగ్రెస్ లీగల్ సెల్ న్యాయవాదులు బత్తుల బసవపు పున్నయ్య కర్లపూడి శ్రీనివాసరావు వైవి శ్రీనివాస్ నాయుడు సింగం జనార్ధన్ కాసర రాజశేఖర్ రెడ్డి హేమంత్ కుమార్ ఆకుల శేఖర్ ఎస్వీ రమణ ఆర్ఎల్ఎన్ శాస్త్రి పాములు దానయ్య చంద్రశేఖర్ గుప్తా డోన్వాన్ వెంకయ్య డి రాము పంబ నాగేశ్వరరావు పి పాపారావు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. మహిళా న్యాయవాదులు ఊటుకూరి విజయలక్ష్మి ప్రవళిక అనుష తదితరులు నిరసనకు మద్దతు తెలిపారు

# విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ అధ్యక్షునిగా కేసోజు రమేష్




**స్టేషన్‌ఘన్‌పూర్/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ సంఘం స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణ కమిటీ అధ్యక్షునిగా కేసోజు రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పట్టణ కేంద్రంలో మండల గౌరవ అధ్యక్షుడు ఉమాశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కేసోజు రమేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా మారేడుపాక మోహన్, మొగుదుంపురం కిషోర్, కేసోజు చంద్ర మోహన్, చెక్కపల్లి రాజు, శ్రీను, రుక్మాచారి, భీష్మాచారి, శ్రీకాంత్, ఉపేందర్, లక్ష్మీనారాయణ, రాజు, కుమార్, సతీష్, రాజు, మహేష్, గణేష్, వెంకటేష్, శంకర్, సతీష్, అనిల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన





**స్టేషన్‌ఘన్‌పూర్/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** ద జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ (ఎన్ఎంఎన్ఎఫ్)లో భాగంగా మండలంలోని కొత్తపెల్లి గ్రామ పరిధిలోని వ్యవసాయ క్షేత్రాలను మండల వ్యవసాయ అధికారి ఎస్.కరుణాకర్ సందర్శించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో సహజ వనరులతో తయారు చేసే ఎరువులు, పురుగుమందుల వినియోగంపై రైతులకు వివరించారు. రసాయనిక పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా ఆహార ధాన్యాల్లో పురుగుమందుల అవశేషాలను తగ్గించి సురక్షితమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చని ఎంఏఓ కరుణాకర్ తెలిపారు. ఎన్ఎంఎన్ఎఫ్ పద్ధతిలో సాగు చేస్తున్న వరి పొలంలో వర్మీకంపోస్టు వినియోగం ద్వారా నేల సారాన్ని పెంచడంతోపాటు పంటకు అవసరమైన పోషకాలను సహజ పద్ధతుల్లో అందించవచ్చని రైతులకు ప్రదర్శన ద్వారా వివరించారు. జనగామ జిల్లా ఎన్ఎంఎన్ఎఫ్ కోఆర్డినేటర్ హరీష్ రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపెల్లి గ్రామ సర్పంచి ముక్కెర స్వరూప రవి, ఏఈఓ బి.శ్రావణి, గ్రామపంచాయతీ కార్యదర్శి స్వప్న, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయానికి యత్నం.. వ్యక్తి అరెస్టు

## 100 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం.. మరో ముగ్గురి కోసం గాలింపు

**హసన్‌పర్తి/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** గంజాయి అక్రమంగా తరలించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని హసన్‌పర్తి పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.5 వేల విలువైన 100 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ.మహేందర్ మార్గదర్శకత్వంలో ఎస్ఐ పి.గోవర్ధన్ సిబ్బందితో కలిసి బుధవారం సాయంత్రం ఓఆర్ఆర్ క్రాస్‌రోడ్డు, వంగపహాడ్ క్రాస్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో వంగపహాడ్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు నడుచుకుంటూ వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకోగా.. మరో ఇద్దరు అక్కడి నుంచి పరారయ్యారు.

పట్టుబడిన వ్యక్తిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెర్ల మండలం శివాలయం రోడ్డుకు చెందిన సయ్యద్ గుల్షన్ అలియాస్ సోహెల్ (26)గా గుర్తించారు. విచారణలో ఒడిశాలోని కోరుమనూర్‌కు చెందిన బాలు వద్ద రూ.2 వేలతో అర కిలో గంజాయి కొనుగోలు చేసినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. వంగపహాడ్‌కు చెందిన మొహమ్మద్ ఖాలీద్ అలియాస్ మిన్ను, మొహమ్మద్ సబ్రుతో కలిసి గంజాయి విక్రయించి సులభంగా డబ్బు సంపాదించేందుకు పథకం వేసినట్లు పేర్కొన్నారు.

కొంత గంజాయిని విక్రయించిన అనంతరం మిగిలిన గంజాయిని హనుమకొండలో విక్రయించేందుకు ఆటో



కోసం ఎదురుచూస్తుండగా పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. ఘటనపై హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న మొహమ్మద్ ఖాలీద్, మొహమ్మద్ సబ్రు, ఒడిశాకు చెందిన బాలు కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయం, కొనుగోలు, రవాణా, నిల్వ చేయడం, వినియోగించడం చట్టరీత్యా నేరమని ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై సమాచారం ఉంటే 112కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన జీవనం

## కేసముద్రం మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమా నాగేశ్వర్‌రావు



**కేసముద్రం/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని కేసముద్రం మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమా నాగేశ్వర్‌రావు అన్నారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని రైతువేదికలో గురువారం అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఉచితంగా అందిస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ముందస్తు విద్యతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం, ఆరోగ్య సంరక్షణ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో చిన్న తరగతుల నుంచే అధిక ఫీజులు చెల్లిస్తూ తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించి అక్కడ అందుతున్న విద్య, పోషకాహార సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్వో వివేక్, ఏసీడీపీవో కమలాదేవి, సూపర్‌వైజర్లు దుర్గ, జ్యోతి, సర్దార్‌బీ, సంధ్య, బీఆర్‌బీ కోఆర్డినేటర్ చైతన్య బృందం, హబ్ కోఆర్డినేటర్ మహేశ్వరి బృందం, చైల్డ్‌లైన్ ప్రతినిధి కమలాకర్ బృందం, అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆయాలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధార్థ పాఠశాలలో ముందస్తుగా బతుకమ్మ వేడుకలు



**చెన్నారావుపేట/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, డైరెక్టర్ వీరమల్ల మాధవరెడ్డి బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. పూర్వీకుల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు సంప్రదాయ పండుగల విశిష్టతను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అండేం కరుణాకర్‌రెడ్డి, మేడి రమేష్‌గౌడ్, ముదురు పద్మ, నామాల సృజన, కుండె రోజారాణి, బొజ్జ స్వప్న, దివ్యజ్యోతి, రమాదేవి, స్రవంతి, జ్యోతి, రజిత, శైలజ, శ్రావణి, రోజా, కాచవరపు సంధ్య, అఖిల, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# నీటిని కాపాడండి.. పర్యావరణాన్ని రక్షించండి

## వర్షపు నీటి సంరక్షణపై అవగాహన




**హసన్‌పర్తి/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** వర్షపు నీటిని సంరక్షించడంతోపాటు పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎస్సార్ యూనివర్సిటీ అసోసియేట్ ఫిజికల్ డైరెక్టర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. రవీందర్ సూచించారు. ఎస్సార్ యూనివర్సిటీ, వరంగల్‌కు చెందిన ఎస్ఆర్‌యూఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా గురువారం వర్షపు నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, పాఠశాల విద్యార్థులకు నీటి సంరక్షణ, వర్షపు నీటి సేకరణ, భూగర్భ జలాల పెంపు, నీటి వనరులను సుస్థిరంగా వినియోగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వర్షపు నీటిని వృథా చేయకుండా సేకరించి భవిష్యత్ అవసరాలకు వినియోగించుకోవాలని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వివరించారు. ప్రతి నీటి బొట్టును సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎల్లాపూర్ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు పుల్ల సంపత్, విద్యార్థులు, ఎస్ఆర్‌యూఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చురుకుగా పాల్గొన్నారు. నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఎస్ఆర్‌యూఎన్ఎస్ఎస్ యూనిట్ చేస్తున్న కృషిని పాల్గొన్నవారు అభినందించారు. కార్యక్రమాన్ని డాక్టర్ కె. రవీందర్ సమన్వయం చేశారు.

# సాగునీరు అందక ఎండుతున్న పంటలు

## విద్యుత్ సరఫరా కోసం సబ్‌స్టేషన్ వద్ద రైతుల ఆందోళన



**కేసముద్రం/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** విద్యుత్ సరఫరా సక్రమంగా లేక సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కేసముద్రం మండలం కాట్రపల్లి, భవానీగడ్డ తండా తదితర గ్రామాల రైతులు గురువారం తీగలవేని సబ్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. సకాలంలో విద్యుత్ సరఫరా చేయకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల నాయకులు అక్కడికి చేరుకుని రైతుల ఆందోళనకు మద్దతు తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. అనంతరం గుడూరు ఎస్ఐ రమేష్‌బాబు సమక్షంలో విద్యుత్ శాఖ ఏఈ రైతులతో మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో నెలకొన్న సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. సమస్య మళ్లీ పునరావృతమైతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని రైతులు, బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గూగులోతు వీరునాయక్, ధనసరి పీఏసీఎస్ డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, బేరువాడ సర్పంచ్ ఈసం లక్ష్మీనారాయణ, నాయకులు కృష్ణ, ఆగే రాము, భానోత్ వెంకన్న, రాజు, సురేష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి.

## -ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు తెలపాలని విజ్ఞప్తి.



**బయ్యారం/,అక్టోబర్ 8(జర్నలిస్ట్ వార్త)**

ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గురువారం హైదరాబాద్ లోని ఎమ్మెల్యే కోరం కనకయ్యను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు పూర్తి మద్దతు అందించి గెలుపుకు సహకరించాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ప్రాంతీయ ప్రయోజనాలు,ఎన్నికల వ్యూహాలపై వారితో చర్చించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసిన వారిలో నాయకులు మూల మధుకర్ రెడ్డి,సర్పంచ్ ప్రవీణ్ నాయక్,తిరుమల ప్రభాకర్ రెడ్డి,చెరుకుపల్లి నరేందర్,వెంకటపతి,సపవత్ రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కేసముద్రంలో 600 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం

## రేషన్ బియ్యాన్ని ప్రైవేట్ బ్రాండ్ సంచుల్లోకి మార్చి విక్రయం

## నిందితుడిపై కేసు నమోదు

**కేసముద్రం/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):**

పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచి, ప్రైవేట్ బ్రాండ్ బియ్యంగా మార్చి అధిక ధరకు విక్రయిస్తున్న వ్యక్తిని కేసముద్రం పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 600 కిలోల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో కేసముద్రం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా




మైసూర్ బేకరీ సమీపంలోని ఓ అద్దె దుకాణంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు పంచుల సమక్షంలో దుకాణాన్ని తనిఖీ చేశారు. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన పరకాల మురళి(46) వద్ద 50 కిలోల చొప్పున ఉన్న 12 బస్తాల్లో మొత్తం 600 కిలోల బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.15 వేలుగా పోలీసులు అంచనా వేశారు. విచారణలో మురళి రేషన్ కార్డు లబ్ధిదారుల నుంచి కిలో రూ.10 చొప్పున పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తేలిందని పోలీసులు తెలిపారు. బియ్యాన్ని తన దుకాణంలో నిల్వ ఉంచి, అనంతరం ప్రైవేట్ బ్రాండ్ సంచుల్లోకి మార్చి బ్రాండెడ్ బియ్యంగా విక్రయిస్తున్నట్లు వెల్లడించారు.

స్వాధీనం చేసుకున్న బియ్యం నమూనాలను రసాయన పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపించారు. మిగిలిన బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన కేసముద్రం ఎస్ఐ కె. క్రాంతి కిరణ్ దర్యాప్తు చేపట్టారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు

# కేసముద్రంలో నూతన బార్ అండ్ రెస్టారెంట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

## వార్షిక లైసెన్స్ ఫీజు రూ.30 లక్షలు

**కేసముద్రం/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):**

కేసముద్రం పట్టణంలో నూతనంగా బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేసేందుకు అర్హులైన ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గూడూరు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు నిబంధనల ప్రకారం దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుదారులకు కనీసం 21 సంవత్సరాల వయస్సు పూర్తై ఉండాలి. బార్ అండ్ రెస్టారెంట్‌కు వార్షిక లైసెన్స్ ఫీజు రూ.30 లక్షలుగా నిర్ణయించారు. దరఖాస్తుతో



పాటు తిరిగి చెల్లించని రూ.1 లక్ష రుసుమును డీడీ లేదా చలాన్ రూపంలో 'డీపీఓమహబూబాబాద్' పేరిట సమర్పించాలి. సంతకం చేసిన ఆధార్‌కార్డు, పాన్‌కార్డు నకళ్లను దరఖాస్తుకు జత చేయాలి. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం, మహబూబాబాద్, డిప్యూటీ కమిషనర్ ఎక్సైజ్ కార్యాలయం, వరంగల్, ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం, హైదరాబాద్‌లో సమర్పించవచ్చని అధికారులు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలి. మరిన్ని వివరాలకు గూడూరు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓను 8712659013 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# సొసైటీకి గోనె సంచుల వివాదం

## తెరపై కొందరు.. తెరవెనుక మరికొందరు -ఆరోపణలను ఖండించిన సీఈఓ, మాజీ కేంద్రం ఇన్‌చార్జి

**ఎల్కతుర్తి/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని ది విశాల సహకార సంఘంలో గోనె సంచుల బార్దన్ వ్యవహారం వివాదానికి దారితీసింది. సంఘం 72వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించి, సంఘాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తామని అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. దామెరలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్న సమయంలో ఐకేపీతో పాటు సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు అంశం తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో గోనె సంచుల బార్దన్ విషయమై గతంలో సమస్యలు తలెత్తాయని, అందువల్ల సొసైటీకి కొనుగోలు కేంద్రం మంజూరు విషయంలో ఇబ్బందులు ఎదురయ్యాయని కొందరు రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని కేంద్రం ఏర్పాటు సమయంలో సొసైటీ సీఈఓ, సంఘం డైరెక్టర్ సమక్షంలో రైతుల వద్ద ప్రస్తావించినట్లు వారు చెబుతున్నారు.




కొత్తగా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ నాయకులు, సంబంధిత డైరెక్టర్లు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కోరినట్లు సమాచారం. వారి విజ్ఞప్తి మేరకే సొసైటీ ఆధ్వర్యంలో మళ్లీ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని కొందరు పేర్కొంటున్నారు. అయితే గోనె సంచుల వ్యవహారంలో కొందరు చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

### ఆరోపణల్లో వాస్తవం లేదు

గోనె సంచుల బార్దన్ విషయంలో ఎలాంటి షార్ట్‌ఫాల్ జరగలేదని సొసైటీ సీఈఓ తిరుపతి స్పష్టం చేశారు. దీనికి సంబంధించి నో డ్యూస్ కూడా ఇచ్చామని తెలిపారు. గతంలో కేంద్రం ఇన్‌చార్జిగా పనిచేసిన గొర్రె రాజేశ్వరరావు హయాంలోనూ గోనె సంచుల విషయంలో ఎలాంటి తప్పిదం జరగలేదన్నారు. తప్పుడు సమాచారంతోనే ఆరోపణలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

### రుజువు చేస్తే దేనికైనా సిద్ధం

తనపై గోనె సంచుల బార్దన్ విషయంలో తప్పుడు ప్రచారం చేయడం బాధాకరమని మాజీ కేంద్రం ఇన్‌చార్జి గొర్రె రాజేశ్వరరావు అన్నారు. తనపై వచ్చిన ఆరోపణలను రుజువు చేస్తే దేనికైనా సిద్ధంగా ఉన్నానని ఆయన మీడియాతో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# మూల్యాంకన కేంద్రం, బ్రేక్‌ఫాస్ట్ కిచెన్ షెడ్ పనుల తనిఖీ

**కేసముద్రం/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సమాధాన పత్రాల బాహ్య మూల్యాంకన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి మందుల శ్రీరాములు సూచించారు. బుధవారం కేసముద్రం మండలంలో 6, 9 తరగతుల విద్యార్థుల మొదటి సమ్మేటివ్ పరీక్షల సమాధాన పత్రాల బాహ్య మూల్యాంకన కేంద్రాన్ని ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలు, మూల్యాంకనానికి



సంబంధించిన రికార్డులు, విద్యార్థుల హాజరు, మూల్యాంకన విధానం, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా మూల్యాంకనం చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల ప్రతిభను సక్రమంగా అంచనా వేసేలా మూల్యాంకన ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కేంద్రంలోని మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం నూతనంగా ఏర్పాటు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్ కిచెన్ షెడ్ పనులను ఆయన పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, సెంటర్ ఇన్‌చార్జి దేవుసింగ్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ షేక్ ఖాదర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ వెన్ను బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వార్త TELTEL/2023/87607
శుక్రవారం 9 అక్టోబర్ 2026

## బాపూజీ కుటుంబానికి ఎమ్మెల్సీ ఇవ్వాలి

### సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపాలి



**పాలకుర్తి/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** గవర్నర్ కోటాలో తెలంగాణ జాతిపిత, సామాజిక న్యాయ ఉద్యమ సారథి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తె డాక్టర్ పవిత్ర వాణిని ఎమ్మెల్సీగా నామినేట్ చేసేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపాలని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడారపు సుధాకర్ కోరారు. గురువారం పాలకుర్తి మండల కేంద్రంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిలుకమారి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల సిరిసిల్లలో నిర్వహించిన బహిరంగ సభలో పద్మశాలీలకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. బాపూజీ కుటుంబానికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం ద్వారా పద్మశాలి, ఇతర బీసీ వర్గాల ఆకాంక్షలకు గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. చేనేత రంగం అభివృద్ధి, సహకార ఉద్యమ నిర్మాణంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం సహాయ కార్యదర్శి పెనుగొండ రమేష్, పోపా జిల్లా సహాయ కార్యదర్శి చిదురాల ఎల్లయ్య, విగ్రహ కమిటీ గౌరవ సలహాదారు, మాజీ ఉపసర్పంచ్ కాటబత్తిని రమేష్, పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి చిదురాల మార్కండేయ, విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ గౌరవ అధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చిలుకమారి సోమేశ్వర్, ఉపాధ్యక్షుడు ఈగ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు చిలుకమారి శ్రీధర్, చిలుకమారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధార్థ పాఠశాలలో ముందస్తుగా బతుకమ్మ వేడుకలు



**చెన్నారావుపేట/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, డైరెక్టర్ వీరమల్ల మాధవరెడ్డి బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. పూర్వీకుల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు సంప్రదాయ పండుగల విశిష్టతను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అండేం కరుణాకర్‌రెడ్డి, మేడి రమేష్‌గౌడ్, ముదురు పద్మ, నామాల సృజన, కుండె రోజారాణి, బొజ్జ స్వప్న, దివ్యజ్యోతి, రమాదేవి, స్రవంతి, జ్యోతి, రజిత, శైలజ, శ్రావణి, రోజా, కాచవరపు సంధ్య, అఖిల, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## బెదిరించి రూ.లక్ష తీసుకున్నారంటూ కేసు

**గీసుగొండ/అక్టోబరు 8 (జర్నలిస్ట్ వార్త):** ధర్మారం గ్రామంలో బెదిరించి రూ.లక్ష తీసుకుని, దాడి చేశారంటూ అందిన ఫిర్యాదుపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ.విశ్వేశ్వర్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం. కోర్టు కేసు ఖర్చుల విషయంలో చీర్ల ఉమారెడ్డి (59)కి తన తమ్ముడు చీర్ల మల్లారెడ్డితో వివాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో బుధవారం సుంకరి శివ ఇంటి వద్ద పంచాయతీ నిర్వహించారు. డబ్బులు ఇవ్వడానికి ఉమారెడ్డి నిరాకరించడంతో బెదిరించి రూ.లక్ష తీసుకున్నారని, కుర్చీ, టీపాయ్‌తో దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మల్లారెడ్డి, అతని కుమారుడు రాజిరెడ్డి దూషించి, ఛాతిపై కొట్టి బెదిరించినట్లు ఆరోపించారు. ఫిర్యాదు మేరకు సుంకరి శివ, చీర్ల మల్లారెడ్డి, చీర్ల రాజిరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సాక్షుల వాంగ్మూలాలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

## మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ..?

### -బయ్యారంలో బరితెగించిన వైన్ సిండికేట్..!

**బయ్యారం/,అక్టోబర్ 8.(జర్నలిస్ట్ వార్త)** లాభాల వేటలో వైన్ సిండికేట్ బరితెగిస్తుంటే,మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ నిద్రపోతోంది. చట్టాలు, నిబంధనలను బొందపెడుతూ చిన్నారుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఉదంతం బయ్యారంలో వెలుగుచూసింది. మద్యం దుకాణాల వద్ద "21 సంవత్సరాల లోపు ఉన్నవారికి మద్యం అమ్మబడదు" అని పెద్ద పెద్ద అక్షరాలతో బోర్డులు దర్శనమిస్తున్నప్పటికీ ,క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. వైన్స్ నిర్వాహకులు కాసుల కక్కుర్తితో వయస్సుతో సంబంధం లేకుండా మైనర్లకు, చిన్నారులకు విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు .పసిచేతుల్లోకి మద్యం సీసాలు వెళ్తుండటంతో లేత వయస్సులోనే పిన్న వయస్కులు వ్యసనాల బారినపడి భవిష్యత్తును బలి చేసుకుంటున్నారు.



#### అధికారుల 'లంచాల ప్యాకేజీ'..!

మద్యం విక్రయాలను నిరంతరం పర్యవేక్షించాల్సిన ఎక్సైజ్ (అబ్కారీ) అధికారులు లంచాల ప్యాకేజీలకు అలవాటుపడి అసలు తనిఖీలే మరచిపోయారని స్థానికులు మండిపడుతున్నారు. వైన్ సిండికేట్ ఇచ్చే మామూళ్లకు కక్కుర్తిపడి అధికారులు కళ్ళు మూసుకోవడం వల్లే వ్యాపారులు ఈ స్థాయిలో బరితెగిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

#### మహిళా సంఘాల ఆగ్రహం.

బయ్యారంలో క్రమంగా పెరుగుతున్న ఈ అక్రమాలపై మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. చిన్నపిల్లల జీవితాలను నాశనం చేస్తున్న వైన్ సిండికేట్ నిర్వాహకులపై, వారికి సహకరిస్తున్న అధికారులపై తక్షణమే ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## రాహుల్ గాంధీకి చిన్న గీత పడినా బీజేపీ పునాదులు కదులుతాయి

### మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్

**మహబూబాబాద్/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** దేశ భవిష్యత్ తరాలకు దిక్సూచిగా ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి చిన్న గీత పడినా సహించేది లేదని, ఆయనకు ఏదైనా జరిగితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పునాదులు కదిలిపోతాయని మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ హెచ్చరించారు. రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును నిరసిస్తూ గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మదర్ తెరెసా సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఖలీల్, ఎడ్ల రమేష్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జ్యోతి రమేష్ నాయక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ చేస్తున్న పోరాటాలను అణచివేయాలని చూస్తే ఉద్యమం మరింత ఉధృతమవుతుందని అన్నారు. రాహుల్ గాంధీని వెంటనే విడుదల చేయాలని, పౌరుల ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని హెచ్చరించారు. ఓటర్ల జాబితా, ఓటు హక్కు ల్యాప్స్‌పై వస్తున్న ఆరోపణలకు ఎన్నికల సంఘం పారదర్శకంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని కోరారు. ప్రజల గొంతును ఎంత అణచివేస్తే అంతగా ఉద్యమం బలపడుతుందని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ పట్టణ, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## గంజాయి ముఠాకు పోలీసుల చెక్

### ఐదుగురి అరెస్ట్.. 50 గ్రాముల గంజాయి స్వాధీనం -ఐదు సెల్‌ఫోన్లు సీజ్.. సరఫరా మూలాలపై పోలీసుల ఆరా

**కమలాపూర్/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** గంజాయి విక్రయాలు, వినియోగానికి పాల్పడుతున్న ఐదుగురిని కమలాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు కమలాపూర్ పోలీసులు, వరంగల్ ఈ-యాంగిల్ ఫోర్స్ సిబ్బంది కలిసి శనిగరం గ్రామ శివారులో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వెనుక వైపు శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా సుమారు 50 గ్రాముల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు లభించినట్లు సీఐ నవీన్ తెలిపారు. అరెస్టయిన వారిలో శనిగరం గ్రామానికి చెందిన గూడల గౌతమ్, నిగ్గుల రాజు, వొట్టేముల కార్తీక్, తట్ల శ్యామ్, లక్ష్మీపురం గ్రామానికి చెందిన మండల గౌతమ్ ఉన్నారు. గంజాయి, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎవరికి సరఫరా చేస్తున్నారు? వీరి వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు, సరఫరాపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. తనిఖీల్లో ఎస్ఐ అనంతగిరి మధు, కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, మోహన్, ఉదయ్‌కుమార్, భాస్కర్, వెంకటేష్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## సిరిపురం మేజర్‌కు సీతారామ జలాలు

### సాగునీటితో రైతులకు ప్రయోజనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే రాగమయి





**తల్లాడ/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గురువారం తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామం వద్ద సీతారామ ప్రాజెక్టు ద్వారా సిరిపురం మేజర్‌కు విడుదలైన సాగర్ జలాలను ఆమె లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం కోటి ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పినా ఆ దిశగా ఆశించిన స్థాయిలో నీరు అందించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వందలాది క్యూసెక్కుల నీటిని తీసుకొచ్చి రైతులకు అందిస్తున్నామని తెలిపారు. సాగర్ కాలువల మరమ్మతుల కారణంగా జలాల విడుదలలో కొంత ఆలస్యం జరిగిందని, ఇకపై సమృద్ధిగా సాగర్ జలాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్నారుగూడెం గ్రామ అభివృద్ధికి ఇప్పటికే కోట్లాది రూపాయలు వెచ్చించామని, భవిష్యత్‌లో సైడ్ డ్రైనేజీలు, స్మశానవాటిక తదితర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం ఎమ్మెల్యే రాగమయి దయానంద్‌ను గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్, మాజీ సర్పంచ్ మారెళ్ల మమత, మల్లికార్జున్‌రావు దంపతులు, జిల్లా నాయకులు మారెళ్ల లక్ష్మణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కోసూరి వెంకటేశ్వరరావు శాలువాలతో సత్కరించారు.

కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, ఎన్ఎస్పీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, రైతులు, అంగన్‌వాడీ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

#### తల్లాడలో స్మార్ట్ కార్డుల పంపిణీ

తల్లాడ పట్టణంలో నూతన స్మార్ట్ కార్డులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద వర్గాలకు అండగా నిలుస్తూ సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, నాయకులు మోకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### సిరిపురం మేజర్‌కు సీతారామ జలాలు విడుదల

**తల్లాడ/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** రైతులకు సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గురువారం తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో నీటిపారుదల శాఖ అధికారుల సమక్షంలో సీతారామ ప్రాజెక్టు ద్వారా విడుదలైన సాగునీటిని ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం కోటి ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించినప్పటికీ ఆచరణలో ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వందలాది క్యూసెక్కుల నీటిని తీసుకొచ్చి రైతులకు అందిస్తున్నామని తెలిపారు. సాగర్ కాలువ మరమ్మతుల కారణంగా నీటి విడుదలలో కొంత ఆలస్యం జరిగిందని, ఇకపై సమృద్ధిగా సాగర్ జలాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.



రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నీటిపారుదల శాఖ డీఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో అందించిన నీటి సామర్థ్యంతో పోలిస్తే ప్రస్తుతం ఐదు రెట్లు అధికంగా నీటిని అందించనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సాగర్ కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా పరిశుభ్రంగా ఉంచే బాధ్యత రైతులు, ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్సీ, ఏఈ, డీఈతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

## ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపణ -అంబేద్కర్ విగ్రహం వరకు ఇండియా కూటమి భారీ నిరసన ర్యాలీ

**ఖమ్మం/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని స్వర్ళ అధ్యయన వేదిక అధ్యక్షుడు స్వర్ళ భాస్కర్, ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని పెవిలియన్ గ్రౌండ్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ఇండియా కూటమి పార్టీల ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీఏ ఖమ్మం ప్రతినిధులతో పాటు అఖిలపక్ష పార్టీల నేతలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్ళ భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని






ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ఎన్నికల ప్రధాన కమిషనర్‌పై ప్రజల్లో అనేక అనుమానాలు నెలకొన్నాయని అన్నారు. దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ, ఓటర్ల జాబితాలో అవకతవకలు, ఈవీఎంలపై అనుమానాలు వంటి అంశాలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. రాహుల్ గాంధీ ప్రస్తావించిన ఓటు చోరీ ఆరోపణల నేపథ్యంలో జ్ఞానేష్ కుమార్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇండియా కూటమి చివరి వరకు పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# సబ్‌స్టేషన్లలో విద్యుత్ పరికరాలపై నిరంతర పర్యవేక్షణ

## రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**ఎల్కతుర్తి/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** రైతులకు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఐఏఎస్ అన్నారు. గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌తో పాటు భీమదేవరపల్లి 132/32 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా పరిస్థితిని క్షేత్రస్థాయిలో సమీక్షించారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న వోల్టేజ్ హెచ్చుతగ్గులు, తక్కువ వోల్టేజ్ సమస్యలు, ఫీడర్ల పనితీరు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలకు కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. వోల్టేజ్ సమస్యలు ఉన్న



ప్రాంతాలను గుర్తించి లోడ్ బ్యాలెన్సింగ్ చేపట్టాలని, అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఫీడర్లపై లోడ్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, బ్రేకర్లు, ఇతర విద్యుత్ పరికరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఏదైనా లోపం గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సీఎండీ సూచించారు. వినియోగదారుల సమస్యలపై ఆలస్యం లేకుండా స్పందించి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

సీఎండీ వెంట హనుమకొండ ఎస్ఈ సామ్యానాయక్, ఏడీఈ వంశీ, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్ట్‌షాపుల డబ్బాలు

## విచ్చలవిడిగా మద్యం విక్రయాలు.. పట్టించుకోని ఎక్సైజ్ శాఖ

**నర్సంపేట/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట డివిజన్‌లోని పలు గ్రామాల్లో కిరాణా దుకాణాల పేరుతో ఏర్పాటు చేసిన డబ్బాలు అక్రమ మద్యం విక్రయ కేంద్రాలుగా మారుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధి కోసం ఏర్పాటు చేసిన చిన్నచిన్న దుకాణాల్లో బెల్ట్‌షాపుల తరహాలో మద్యం విక్రయాలు సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో గుడుంబా విక్రయాలు కూడా జరుగుతున్నాయని చెబుతున్నారు.

ప్రధాన రహదారులు, గ్రామాల కూడళ్ల వద్ద మద్యం విక్రయాలు బహిరంగంగానే జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు తగిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్‌షాపులపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమ విక్రయాలు సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నప్పటికీ, వాటిని అధికారులు ఖండించాల్సిన అవసరం ఉంది. మద్యం విక్రయాలపై తనిఖీల్లో భాగంగా బ్రాండ్ షాపుల నుంచి బెల్ట్‌షాపులకు మద్యం తరలిస్తున్నారా.. ఆ మద్యం ఎక్కడ కొనుగోలు చేశారు.. బాటిళ్లపై సంబంధిత విక్రయ కేంద్రం సీల్, ముద్రలు ఉన్నాయా అనే అంశాలపైనే తనిఖీలు పరిమితమవుతున్నాయని స్థానికులు అంటున్నారు. బెల్ట్‌షాపుల వద్ద నేరుగా జరుగుతున్న అక్రమ మద్యం విక్రయాలపై కూడా సమగ్రంగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

బ్రాండ్ షాపుల యాజమాన్యాలు, బెల్ట్‌షాపుల నిర్వాహకుల



మధ్య ఉన్న సంబంధాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. రాజకీయ నాయకుల అండదండలతోనా.. లేక అధికారుల నిర్లక్ష్యం కారణంగానా బెల్ట్‌షాపులు పెరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలకు ఆధారాలు ఉంటేనే వాటిని నిర్ధారించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న గ్రామీణ



కుటుంబాలపై మద్యం విక్రయాల ప్రభావం తీవ్రంగా ఉంటోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యం కారణంగా కుటుంబ కలహాలు పెరుగుతున్నాయని, యువత కూడా వ్యసనానికి గురవుతున్నారని పేర్కొంటున్నారు. నర్సంపేట డివిజన్‌లో బెల్ట్‌షాపులపై ప్రత్యేక దృష్టి సారించి, అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు ఎక్సైజ్ శాఖ అధికారులను కోరుతున్నారు.

# కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సర్పంచ్ గుగులోతు లక్ష్మీ ఉమ్లా నాయక్

## టీబీ ముక్త్ గ్రామ పంచాయతీగా ఫతేపూర్ ఎంపిక




**స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** క్షయవ్యాధి నిర్మూలనలో విశేష కృషి చేసినందుకు ఫతేపూర్ గ్రామ పంచాయతీని టీబీ ముక్త్ గ్రామ పంచాయతీగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫతేపూర్ గ్రామ సర్పంచ్ గుగులోతు లక్ష్మీ ఉమ్లా నాయక్ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఫతేపూర్ గ్రామాన్ని టీబీ రహిత గ్రామంగా తీర్చిదిద్దడంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది, గ్రామ ప్రజల సమష్టి కృషి కీలకంగా నిలిచిందని తెలిపారు. ఈ అవార్డు గ్రామ పంచాయతీ చేసిన కృషికి లభించిన గుర్తింపుగా భావిస్తున్నామని సర్పంచ్ గుగులోతు లక్ష్మీ ఉమ్లా నాయక్ పేర్కొన్నారు. టీబీ రహిత సమాజ నిర్మాణం, ప్రజారోగ్య పరిరక్షణ, గ్రామ అభివృద్ధి కోసం భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో పనిచేస్తామని తెలిపారు.

# విద్యార్థుల విద్యకు బాసటగా నిలుస్తున్న 'చేతన ఫౌండేషన్'




**బయ్యారం/,అక్టోబర్ 8.(జర్నలిస్ట్ వార్త)** విద్యార్థుల భవిష్యత్తుకు బాసటగా నిలుస్తూ 'చేతన ఫౌండేషన్' పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని గురిమెళ్ళ సర్పంచ్ వజ్జా భద్రయ్య అన్నారు. గురువారం గురిమెళ్ళ ప్రాథమిక పాఠశాలలో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు వేణిగళ్ల వెంకటేశ్వరరావు



అధ్యక్షతన పాఠశాల విద్యార్థులకు ఉచితంగా విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 65 మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగ్‌లు, నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు తాత గణేష్, నిమ్మల రామారావు, నాగరాజు, రాజేష్, వెంకన్నలతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితురాలికి న్యాయం చేయాలి





**వర్ధన్నపేట/అక్టోబరు 8 (జర్నలిస్ట్ వార్త):** ప్రేమ పేరుతో మోసపోయానని ఆరోపిస్తూ ఆందోళన చేస్తున్న యువతికి కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల మాజీ డైరెక్టర్ ఈగ మల్లేశం సంఘీభావం తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి కుమారుడు శ్రీకాంత్ మూడేళ్లుగా పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ప్రస్తుతం నిరాకరిస్తున్నారని యువతి ఆరోపిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పెద్దన్న పాత్ర పోషించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# చెన్నారంలో రీసర్వే పనుల పరిశీలన







**వర్ధన్నపేట/ అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని చెన్నారం గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను వరంగల్ ఆర్డీవో సుమ గురువారం పరిశీలించారు. గ్రామంలో సర్వే ప్రక్రియ పురోగతిని పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీసర్వేను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. భూ వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామస్థులతో మాట్లాడి రీసర్వేపై వారి సందేహాలను తెలుసుకుని నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ సాగర్, గ్రామ సర్పంచ్, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# హన్మాపురం బాధితులకు మందకృష్ణ మాదిగ పరామర్శ





**భువనగిరి/ అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** హన్మాపురంలో ఇటీవల దాడికి గురైన బాధిత మాదిగ కుటుంబాలకు ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు అండగా నిలిచారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ బృందం బాధితుల ఇళ్లకు వెళ్లి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుంది. బాధితులతో దాడి జరిగిన తీరుపై సుదీర్ఘంగా చర్చించింది. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ బాధితులతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. వారికి మనోధైర్యం కల్పిస్తూ, ఘటనకు బాధ్యులైన వారిని తక్షణమే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ, ఎంఎస్‌పీ మాజీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి మాదిగ, ఎంఆర్‌పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ మాదిగ, ఎస్సీఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు బందారు రవివర్ధన్, ఎంఆర్‌పీఎస్ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ, ఎంఎస్‌పీ మాజీ జిల్లా అధికార ప్రతినిధి సందేల శ్రీనివాస్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ భువనగిరి మండల అధ్యక్షుడు సుర్వంగ కుమార్ మాదిగ, భువనగిరి పట్టణ అధ్యక్షుడు అందె సాయికృష్ణ మాదిగ, ఎంఎస్‌పీ నాయకుడు కోళ్ల జహంగీర్ మాదిగతో పాటు గ్రామ మాదిగ కుల పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.



# నాలుగు రోజుల దీక్ష..

# మూడు ముళ్లతో ముగిసిన పోరాటం!

**కన్నీళ్లతో మొదలైన పోరాటం.. ఆనందబాష్పాలతో ముగిసిన ప్రేమకథ**

**పట్టువదలని శ్రీదేవి.. చివరకు పెళ్లికి అంగీకరించిన శ్రీకాంత్ కుటుంబం**

**ఎమ్మెల్యే నాగరాజు చొరవతో ఒక్కటైన ప్రేమజంట.. శ్రీదేవి మెడలో తాళి కట్టిన శ్రీకాంత్**



**వర్ధన్నపేట/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):**
నాలుగు రోజులుగా సాగిన ఆందోళన.కన్నీళ్లు. ఆవేదన.నిరీక్షణ. తన ప్రేమను గెలిపించుకోవాలన్న పట్టుదల. చివరకు ఆ పోరాటానికి ఫలితం దక్కింది. తాను ప్రేమించిన యువకుడినే పెళ్లి చేసుకోవాలంటూ దీక్షకు దిగిన దళిత యువతి శ్రీదేవి పట్టుదల ముందు పరిస్థితులు మారాయి. నాలుగో రోజు ఆమె కోరుకున్నట్టుగానే శ్రీకాంత్‌తో వివాహం జరిగింది. శ్రీకాంత్ శ్రీదేవి మెడలో తాళి కట్టడంతో నాలుగు రోజులుగా కొనసాగిన దీక్షకు ముగింపు పలికింది.
శ్రీకాంత్‌తో తనకు వివాహం జరిపించాలని కోరుతూ శ్రీదేవి వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ఇంటి ఎదుట నాలుగు రోజులుగా దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. వివాహానికి శ్రీకాంత్ కుటుంబ సభ్యులు అంగీకరించాలని ఆమె పట్టుదలగా కోరుతూ ఆందోళన కొనసాగించింది. రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆమె దీక్షను కొనసాగించింది.

**ఎమ్మెల్యే చొరవతో కదిలిన వ్యవహారం**

ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. ఇరువర్గాలతో మాట్లాడి వివాహానికి అంగీకారం కుదిరేలా చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే చొరవతో శ్రీకాంత్, ఆయన కుటుంబ సభ్యులు వివాహానికి అంగీకరించారు. దీంతో ఇరువైపుల కుటుంబ సభ్యులు, కుల పెద్దల సమక్షంలో వివాహం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

**కన్నీళ్ల మధ్య.. మూడు ముళ్లు**

నాలుగు రోజులుగా దీక్షా స్థలంలో ఆవేదనతో ఎదురుచూస్తున్న శ్రీదేవికి చివరకు పెళ్లి సమయం వచ్చింది. కుటుంబ సభ్యులు, కుల పెద్దలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో శ్రీకాంత్ శ్రీదేవి మెడలో తాళి కట్టారు. అనంతరం ఇద్దరూ ఒకరికొకరు దండలు మార్చుకున్నారు. దీంతో ఇన్నాళ్లుగా కొనసాగిన నిరీక్షణకు తెరపడింది. కాసేపటి క్రితం వరకు ఆందోళనతో ఉన్న శ్రీదేవి ముఖంలో పెళ్లి వేళ ఆనందం వెల్లివిరిసింది.

**దీక్షకు ముగింపు. కొత్త జీవితానికి శ్రీకారం**

శ్రీకాంత్‌శ్రీదేవి వివాహంతో నాలుగు రోజులుగా కొనసాగుతున్న శ్రీదేవి దీక్షకు ముగింపు పలికింది. ప్రేమికులు ఒక్కటవడంతో అక్కడి వాతావరణం భావోద్వేగంగా మారింది. దళిత సంఘాల ప్రతినిధులు, మహిళలు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఒకరి చేతిలో ఒకరు చేయి వేసుకుని కొత్త జీవితంలోకి అడుగుపెట్టిన ప్రేమజంటను పలువురు అభినందించారు.



తన ప్రేమ కోసం నాలుగు రోజులపాటు దీక్ష చేసిన శ్రీదేవి.. చివరకు తాను కోరుకున్న వ్యక్తితోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. తన పోరాటానికి సహకరించిన కుటుంబ సభ్యులు, కుల పెద్దలు, ప్రజాప్రతినిధులతో పాటు సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.నాలుగు రోజుల ఆవేదన. నాలుగు రోజుల నిరీక్షణ.చివరకు మూడు ముళ్లతో ముగిసిన పోరాటం.కన్నీళ్లతో మొదలైన దీక్ష.. ఆనందబాష్పాలతో కొత్త జీవితానికి నాంది పలికింది.

# ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్న

# నూతన దంపతులు

## ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు చొరవతో శ్రీకాంత్‌తో శ్రీదేవి వివాహం

**నాలుగు రోజుల దీక్షకు తెర.. ఇరువర్గాల సమక్షంలో ఒక్కటైన ప్రేమజంట**











**వర్ధన్నపేట/అక్టోబర్ 8 (జర్నలిస్ట్ వార్త):**
నాలుగు రోజులుగా దీక్ష చేస్తున్న శ్రీదేవి ఆందోళనకు ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు చొరవతో తెరపడింది. శ్రీకాంత్‌తో వివాహానికి ఇరువర్గాల కుటుంబ సభ్యులు అంగీకరించడంతో ప్రేమజంట ఒక్కటైంది. అనంతరం నూతన దంపతులు ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు నివాసానికి వెళ్లి ఆయన, ఆయన సతీమణి మల్లీశ్వరి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎమ్మెల్యే దంపతులు నూతన వధూవరులను ఆశీర్వదించి పెళ్లి వస్త్రాలను అందజేశారు.

**సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవ**

శ్రీదేవి నాలుగు రోజులుగా దీక్ష చేస్తున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాగరాజు వెంటనే స్పందించారు. ఇరువర్గాల కుటుంబ సభ్యులతో చర్చలు జరిపి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు కృషి చేశారు. ప్రేమించిన యువతీయువకులు కలిసి జీవించాలనుకున్నప్పుడు కుటుంబాల మధ్య ఉన్న అపార్థాలను తొలగించుకుని వారికి అండగా నిలవాలని సూచించారు. ఎమ్మెల్యే చొరవతో శ్రీకాంత్ కుటుంబ సభ్యులు వివాహానికి అంగీకరించారు.

**దండలు మార్చుకుని ఒక్కటైన జంట**

కుటుంబ సభ్యుల అంగీకారం అనంతరం శ్రీకాంత్, శ్రీదేవి పరస్పరం దండలు మార్చుకుని ఒక్కటయ్యారు. దీంతో నాలుగు రోజులుగా కొనసాగుతున్న శ్రీదేవి దీక్షకు ముగింపు లభించింది. అక్కడి వాతావరణం ఆనందోత్సాహాలతో నిండిపోయింది. శ్రీదేవికి అండగా నిలిచిన దళిత సంఘాల ప్రతినిధులు, మహిళలు, కుటుంబ సభ్యులు, పట్టణవాసులు హర్షం వ్యక్తం చేశారు.

**ఎమ్మెల్యే ఇంటికి వెళ్లిన నూతన దంపతులు**

వివాహం అనంతరం శ్రీకాంత్, శ్రీదేవి నూతన దంపతులుగా ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు, ఆయన సతీమణి మల్లీశ్వరి వారిని ఆప్యాయంగా పలకరించి ఆశీర్వదించారు. నూతన దంపతులకు పెళ్లి వస్త్రాలను అందజేసి వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

**యువజంటకు అండగా నిలిచిన ఎమ్మెల్యే**

ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ప్రేమ వివాహం చేసుకున్న నేపథ్యంలో యువత ఎదుర్కొనే ఇబ్బందులపై అవగాహనతో శ్రీదేవి, శ్రీకాంత్‌లకు అండగా నిలిచారు. కుటుంబాల మధ్య ఉన్న అభిప్రాయ భేదాలను చర్చల ద్వారా పరిష్కరించి యువజంటకు వివాహం జరిగేలా చొరవ తీసుకున్నారు. యువజంట భవిష్యత్తుకు కుటుంబాలు అండగా నిలవాలని ఆయన సూచించారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థానం చైర్మన్ ప్రభాకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, 1వ డివిజన్ అధ్యక్షుడు చిర్ర రాముగౌడ్, సీనియర్ నాయకులు బుద్దే పెద్దన్న, వర్ధన్నపేట మండల యువజన అధ్యక్షుడు భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ఓటు కోసం

# భారీగా దరఖాస్తులు..

**4.88 లక్షల అప్లికేషన్లు నమోదు**

**ఫామ్-6 దరఖాస్తులు అందజేత**

**ఫారం-7 దరఖాస్తు గణాంకాలు వెల్లడి**

**వంబర్ 9న వెలువడే తుది జాబితా**

**ఓటర్ల సంఖ్యపై రానున్న స్పష్టత**



**హైదరాబాద్, అక్టోబర్ 08(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా కొత్త ఓటు కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 4,88,417 ఫామ్-6 దరఖాస్తులు అందినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అలాగే విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల నుంచి 6,270 ఫామ్-6ఏ దరఖాస్తులు వచ్చాయి. ఓటర్ల వివరాల్లో మార్పులు, చిరునామా సవరణలు వంటి అంశాల కోసం 5,04,782 ఫామ్-8 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఇదే సమయంలో ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనల కోసం ఫామ్-7లు కూడా వేల సంఖ్యలో వచ్చాయి.ఫామ్-7 ద్వారా ఇప్పటికే ఉన్న ఓటరు పేరును తొలగించాలన్న అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనను దాఖలు చేయవచ్చు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా దాఖలైన క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు అక్టోబర్ 7వ తేదీతో ముగిసింది. వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలను పరిశీలించి నవంబర్ 5వ తేదీ వరకు పరిష్కరించనున్నారు. ఆ తర్వాత నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఎన్నికల జాబితా సవరణకు సంబంధించిన ఈ షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ముందుగానే ప్రకటించింది. జిల్లాల వారీగా చూస్తే కొత్త ఓటు నమోదు కోసం అత్యధిక దరఖాస్తులు హైదరాబాద్ జిల్లా నుంచి వచ్చినట్లు ఎన్నికల కార్యాలయం వెల్లడించింది. హైదరాబాద్ పరిధిలోని 15 నియోజకవర్గాల్లో 1,93,135 ఫామ్-6 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 29,226 దరఖాస్తులు ఇప్పటికే ఆమోదం పొందినట్లు సమాచారం. అలాగే హైదరాబాద్ జిల్లా నుంచి 4,127 మంది ఎన్ఆర్ఐలు ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. చిరునామా, ఇతర వివరాల మార్పు కోసం 1,44,495 ఫామ్-8 దరఖాస్తులు అందాయి. ఓటర్ల తొలగింపు అంశంలో హైదరాబాద్ జిల్లా కూడా చర్చనీయాంశంగా మారింది. ఫామ్-7ల దాఖలాపై హైదరాబాద్ నగరంలో రాజకీయ వివాదం నెలకొన్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఇటీవల బల్క్‌గా సమర్పించిన ప్రీ-ఫిల్డ్ ఫామ్-7ల వ్యవహారం కూడా వెలుగులోకి వచ్చింది. అయితే ఎన్నికల అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది ఓటర్ల జాబితాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా మారే అవకాశం ఉందని తాజా రిపోర్టులు సూచిస్తున్నాయి. ఇప్పటికే కోట్లాది మంది ఓటర్ల వివరాలను పరిశీలించి తుది జాబితాలో చేర్చేందుకు అధికారులు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. నవంబర్ 9వ తేదీన వెలువడే తుది జాబితాతో రాష్ట్రంలోని ఓటర్ల సంఖ్యపై స్పష్టత రానుంది. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నవారు, తమ వివరాల్లో మార్పులు కోరినవారు తుది జాబితా ప్రచురణ తర్వాత.. తమ పేరు, వివరాలు ఓటర్ల జాబితాలో సరిగ్గా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవడం కీలకమని ఎన్నికల సంఘం అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల హైదరాబాద్ జిల్లాలో ఓటు తొలగింపు కోసం అందించే? ఫారం-7ల బోగస్? పత్రాల కట్టలు లభ్యమవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది. అయితే ఇవాళ రాష్ట్ర ఎన్నికల కార్యాలయం (ఎస్?ఈవో) రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ఫారం-7లపై స్పష్టతనిచ్చింది. ఇందులో భాగంగా హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 నియోజకవర్గాల నుంచి 6,335 ఫారం-?7లు వచ్చినట్లు ఎస్?ఈవో ప్రకటించింది.
ముషీరాబాద్ నియోజకవర్గంలో 151 ఫారం-7లుగా రాగా, అందులో 87 తొలగించినట్లు తెలిపింది. గోషామహల్‌లో 222 ఫారం-7లకు గానూ 87 తొలగించినట్లు ఎన్నికల కార్యాలయం స్పష్టం చేసింది. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 6,335 ఫారం-7లు అందగా, ఇప్పటి వరకు 2,066 తొలగించారు. మరోవైపు రాష్ట్రంలో కొత్తగా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన ఫారం-6లు అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచే వచ్చినట్లు ఎస్?ఈవో వెల్లడించింది. ఈ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో కొత్త ఓటు కోసం మొత్తంగా 1,93,135 దరఖాస్తులు రాగా, అందులో ఇప్పటి వరకు 29,226 అప్లికేషన్లను ఆమోదించింది. ఈ ప్రాంతం నుంచి 4,127 ఎన్ఆర్ఐలు కూడా కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఎస్?ఈవో వెల్లడించింది. దీంతో పాటు? జిల్లా పరిధిలో అడ్రస్, ఇతర వివరాల మార్పు కోసం 1,44,495 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపింది.

# రామగుండంలో

# బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

**ఈనెల 14న నిర్వహించేందుకు భారీ ప్లాన్**



**హైదరాబాద్, అక్టోబర్ 08((జర్నలిస్ట్ వార్త):**
సింగరేణి బొగ్గు గని కార్మికుల సమస్యలపై పోరాటం చేసేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని.. అందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈనెల 14వ తేదీన రామగుండంలో ' సింగరేణి కార్మిక గర్జన ' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ విషయాన్ని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సింగరేణి ప్రాంతాలకు చెందిన పార్టీ నేతలు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ప్రతినిధులతో హరీశ్‌రావు సమావేశమై మాట్లాడారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి.. సంస్థ ఆర్థిక పరిస్థితి, కార్మికుల సమస్యలు, థర్మల్ విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై వారితో హరీశ్ రావు చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. కార్మికుల డిమాండ్ల సాధన కోసం ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. సింగరేణి సంస్థ లాభాల్లో కార్మికులకు రావాల్సిన వాటాను పూర్తిగా చెల్లించాలని హరీశ్‌రావు ప్రధానంగా డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన కార్మిక కుటుంబ సభ్యులకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించాలని, క్రమం తప్పకుండా మెడికల్ బోర్డులు నిర్వహించాలని కోరారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని.. సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కూడా హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గిందంటూ హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తన వాదనకు సంబంధించి 2023-24లో 70 మిలియన్ టన్నులుగా ఉన్న బొగ్గు ఉత్పత్తి.. 2025-26లో 58 మిలియన్ టన్నులకు తగ్గిందని పేర్కొన్నారు. పరిపాలనా నిర్ణయాలు, టెండర్లు, కాంట్రాక్టు వ్యవహారాల కారణంగానే ఉత్పత్తి తగ్గిందని ఆయన ఆరోపించారు. సింగరేణి కార్మికుల ఇళ్ల హక్కుల అంశాన్ని కూడా ఈ సందర్భంగా హరీశ్‌రావు ప్రస్తావించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 76 కింద మిగిలిన అర్హులైన కార్మికులకు సేల్ డీడ్‌ల ద్వారా హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే సింగరేణి సంస్థకు సంబంధించిన ప్రైవేటీకరణ చర్యలను వ్యతిరేకిస్తామని తెలిపారు. రామగుండంలో జరగనున్న ఈ సభ ద్వారా సింగరేణి కార్మికుల సమస్యలను రాష్ట్రస్థాయిలో మరింతగా ప్రస్తావించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. మరోవైపు, సభకు పెద్ద సంఖ్యలో కార్మికులు, సింగరేణి ప్రాంత ప్రజలు తరలివచ్చేలా పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 14వ తేదీన సాయంత్రం 5 గంటలకు గోదావరిఖని జీఎం కార్యాలయ మైదానంలో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# మళ్లీ వస్తున్న సేనాపతి..

## 'ఇండియన్ 3' వార్ మోడ్ ఆన్!




లోకనాయకుడు కమల్ హాసన్, దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఇండియన్ 3' నుంచి మేకర్స్ ఓ కీలక అప్‌డేట్ ఇచ్చారు. నేడు ఈ సినిమాకు సంబంధించిన ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేసి అభిమానుల్లో ఉత్సాహం నింపారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని చిత్ర వర్గాలు వెల్లడించాయి. నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ సోషల్ మీడియా ద్వారా ఈ పోస్టర్‌ను పంచుకుంది. "సేనాపతి జీరో టాలరెన్స్‌తో తిరిగి వస్తున్నారు. 'ఇండియన్ 3' వార్ మోడ్‌లో పునరుజ్జీవనం" అనే క్యాప్షన్‌ను జోడించింది. దీంతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. వాస్తవానికి 'ఇండియన్ 2' చిత్రీకరణ సమయంలోనే మూడో భాగానికి సంబంధించిన కీలక సన్నివేశాలను కూడా చిత్రీకరించారు. సినిమా నిడివి చాలా ఎక్కువగా ఉండటంతో కథను రెండు భాగాలుగా విడుదల చేయాలని దర్శకుడు శంకర్, కమల్ హాసన్ నిర్ణయించుకున్నారు. 'ఇండియన్ 2' కంటే మూడో భాగంపైనే తనకు ఎక్కువ ఆసక్తి ఉందని కమల్ హాసన్ గతంలోనే స్పష్టం చేశారు. 1996లో వచ్చిన 'ఇండియన్' సంచలన విజయం సాధించడంతో దానికి సీక్వెల్‌గా 'ఇండియన్ 2'ను 2017లో ప్రకటించారు. అయితే, ఈ సినిమా ప్రయాణం అనేక అడ్డంకులను ఎదుర్కొంది. సెట్స్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో ముగ్గురు మరణించడం, ఆ తర్వాత కరోనా మహమ్మారి, దర్శక-నిర్మాతల మధ్య విభేదాల కారణంగా షూటింగ్ చాలాకాలం నిలిచిపోయింది. ఆ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు శంకర్, కమల్ తో పాటు లైకా ప్రొడక్షన్స్ ఆర్థిక సహాయం ప్రకటించింది.
అనంతరం రెడ్ జెయింట్ మూవీస్ రంగంలోకి దిగడంతో వివాదాలు పరిష్కారమై, చిత్రీకరణ తిరిగి ప్రారంభమైంది. ఎట్టకేలకు 'ఇండియన్ 2' పూర్తి చేశారు. ఆ సినిమా విడుదలైన రెండేళ్ల తర్వాత ఇప్పుడు 'ఇండియన్ 3'కి సంబంధించిన తాజా పోస్టర్ రావడంతో ఫ్రాంచైజీ అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అవినీతిపై సేనాపతి చేసే యుద్ధాన్ని మరోసారి తెరపై చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# తెలంగాణ సంస్కృతికి దర్పణం పట్టిన

# దర్శక మేధావికి గౌరవం

**ప్రముఖ దర్శకుడు బి. నర్సింగరావుకు గౌరవ డాక్టరేట్**

**గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్న 'మా భూమి' ఫేమ్**

**తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పారని నర్సింగరావుపై గవర్నర్ ప్రశంసలు**

**నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ విద్యపై దృష్టి పెట్టాలని గవర్నర్ సూచన**



ప్రముఖ సినీ దర్శకుడు, నటుడు, కవి బి. నర్సింగరావు అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బుధవారం జూబ్లీహిల్స్‌లోని వర్సిటీ ప్రాంగణంలో వైభవంగా జరిగిన 27వ స్నాతకోత్సవంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా ఆయన ఈ గౌరవ పట్టాను స్వీకరించారు.
తెలంగాణ సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన 'మా భూమి' చిత్ర దర్శకుడిగా నర్సింగరావు సుప్రసిద్ధులు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిని, సామాజిక వాస్తవికతను వెండితెరపై ఆవిష్కరించి, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మన్ననలు పొందిన విశిష్ట సృజనశీలిగా నర్సింగరావును కొనియాడారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గవర్నర్.. విద్యార్థులకు డిగ్రీ, పీజీ, ఎం.ఫిల్, పీహెచ్‌డీ పట్టాలతో పాటు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విధ్వంసక చర్యలకు కాకుండా, సమాజ శ్రేయస్సు మరియు పునర్నిర్మాణం కోసం వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఉన్నత విద్యాసంస్థలు నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ విద్యపై మరింతగా దృష్టి సారించాలని ఈ సందర్భంగా సూచించారు.
ఈ స్నాతకోత్సవంలో భాగంగా మొత్తం 23 మంది పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు, ఒకరికి ఎం.ఫిల్ డిగ్రీని అందజేశారు. అలాగే, వివిధ యూజీ, పీజీ కోర్సుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 38 మంది విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేశారు.

# ఫేక్ న్యూస్, ఏఐ కంటెంట్.. ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కంగనా రనౌత్



ప్రముఖ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తన వ్యక్తిత్వ, ప్రచార హక్కుల పరిరక్షణ కోరుతూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పేరు, ఫోటో, గొంతును వాణిజ్యపరంగా వినియోగిస్తున్నారని, ముఖ్యంగా తప్పుడు వార్తలు, కృత్రిమ మేధ సాయంతో సృష్టించిన కంటెంట్ ద్వారా తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన న్యాయస్థానం, ప్రతివాదులకు సమన్లు జారీ చేసింది. జస్టిస్ వికాస్ మహాజన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. కంగనా రనౌత్ తరఫున న్యాయవాది సాకేత్ సిక్రీ వాదనలు వినిపిస్తూ, ఆమె ప్రతిష్ఠను మసకబార్చే విధంగా ఉన్న పలు వెబ్ లింకులను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వీటిలో కొన్ని యానిమేటెడ్ వీడియోలు, మీమ్స్ రూపంలో ఉన్నాయని, అవి వ్యంగ్య ధోరణిలో ఉన్నట్లు కోర్టు వ్యాఖ్యానించింది. అయితే, ప్రస్తుత దశలో వాటిని తొలగించాలని తాము ఒత్తిడి చేయడం లేదని కంగనా తరఫు న్యాయవాది స్పష్టం చేశారు. దావాకు సంబంధించిన నోటీసులు ముందే అందడంతో, కొందరు ప్రతివాదులు ఇప్పటికే అభ్యంతరకర కంటెంట్‌ను తొలగించారని ఆయన న్యాయస్థానానికి వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, కంగనా పిటిషన్‌పై ప్రతివాదులకు సమన్లు జారీ చేయడంతో పాటు మధ్యంతర ఉత్తర్వుల దరఖాస్తుపై నోటీసులు ఇచ్చింది. పిటిషన్ నుంచి కొందరు ప్రతివాదుల పేర్లను తొలగించిన నేపథ్యంలో, సవరించిన జాబితాను దాఖలు చేయాలని కంగనా న్యాయవాదిని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను 2027 ఫిబ్రవరి 3వ తేదీకి వాయిదా వేసింది.
ఇటీవల కాలంలో ప్రముఖులు తమ వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం న్యాయస్థానాలను ఆశ్రయించడం పెరిగింది. గతంలో అమితాబ్ బచ్చన్, అనిల్ కపూర్, రజనీకాంత్, జాకీ ష్రాఫ్ వంటి అగ్ర నటుల విషయంలో ఢిల్లీ హైకోర్టు సానుకూల ఉత్తర్వులు ఇచ్చింది. వారి పేరు, గొంతు, సంభాషణలను అనుమతి లేకుండా వాడరాదని స్పష్టం చేసింది. ఈ క్రమంలో, తప్పుడు వార్తలు, ఏఐ-జనరేటెడ్ కంటెంట్ వంటి ఆధునిక సవాళ్లతో కంగనా దాఖలు చేసిన ఈ పిటిషన్ ప్రాధాన్యత సంతరించుకుంది.



# టైమ్ ట్రావెల్, పునర్జన్మ వంటి ఎలిమెంట్స్‌తో..

స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ తనయుడు నందమూరి మోక్షజ్ఞ తొలి సినిమాను కేవలం డెబ్యూ మూవీగా కాకుండా.. నందమూరి అభిమానులకు గుర్తుండిపోయే సినిమాగా డైరెక్టర్ వశిష్ట స్క్రిప్ట్ ను సిద్ధం చేస్తున్నారట. బింబిసారతో సోషియో ఫాంటసీని తనదైన శైలిలో చూపించిన వశిష్ట.. ఇప్పుడు మోక్షజ్ఞ కోసం కూడా అదే జోనర్ ను ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈసారి మాస్ ఎలిమెంట్స్‌కు కూడా ప్రాధాన్యత ఇస్తున్నారట. మోక్షజ్ఞ బాడీ లాంగ్వేజ్ కు తగ్గట్టుగా స్టోరీని డిజైన్ చేసి.. మొదట్లో సరదాగా ఉండే కుర్రాడిగా అతడి రోల్ చూపించనున్నట్లు సమాచారం. టైమ్ ట్రావెల్, పునర్జన్మ వంటి ఎలిమెంట్స్ కూడా స్టోరీలో కలిపినట్లు తెలుస్తోంది

# చిరంజీవి-శ్రీకాంత్ ఓదెల చిత్రంపై క్లారిటీ ఇచ్చిన నాని

**ప్రాజెక్ట్ ఆలస్యం అవుతుందని, మరింత సమయం పడుతుందని స్పష్టీకరణ**



మెగాస్టార్ చిరంజీవి, 'ప్యారడైజ్' దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ పై నీలినీడలు కమ్ముకున్నాయి. నేచురల్ స్టార్ నాని సమర్పకుడిగా, నిర్మాతగా వ్యవహరించనున్న ఈ చిత్రం ఇప్పట్లో పట్టాలెక్కేలా కనిపించడం లేదు. ఈ సినిమాకు మరికొంత సమయం పడుతుందని, దీనిపై ఇంకా ఎలాంటి తాజా చర్చలు జరగలేదని నాని స్వయంగా స్పష్టం చేశారు. దీంతో ఈ ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్న మెగా అభిమానులకు నిరాశే ఎదురైంది. ఇటీవల ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నాని ఈ ప్రాజెక్ట్ ఆలస్యం కావడానికి గల కారణాలను వివరించారు. ది ప్యారడైజ్' సినిమా నిర్మాణం అనుకున్నదానికంటే ఎక్కువ సమయం తీసుకుందని, దీనివల్ల చిరంజీవి సినిమా షెడ్యూల్ దెబ్బతిందని తెలిపారు. "నిజానికి ఈపాటికి చిరంజీవి గారి సినిమా చిత్రీకరణ చివరి దశలో ఉండాల్సింది. కానీ 'ది ప్యారడైజ్' ఆలస్యమవ్వడంతో కుదరలేదు. దీనిపై మేము ఇంకా కూర్చుని చర్చించుకోలేదు. దీనికి మరికొంత సమయం పడుతుంది" అని నాని స్పష్టం చేశారు. ఈలోగా చిరంజీవి కూడా కొన్ని ఇతర సినిమాలను పూర్తి చేశారని ఆయన పేర్కొన్నారు. 2024 డిసెంబర్ లో ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. చిరంజీవి కెరీర్‌లోనే 'అత్యంత వయొలెంట్ సినిమా'గా ఇది రానుందని ప్రచారం జరగడంతో అంచనాలు ఆకాశాన్నంటాయి. యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తుండటంతో ఈ కాంబినేషన్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా, చిరంజీవి, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల డేట్లు తిరిగి సర్దుబాటు అయ్యాక మాత్రమే ఈ ప్రాజెక్ట్‌పై తదుపరి అప్‌డేట్ వచ్చే అవకాశం ఉంది.

# చరణ్ నెక్స్ట్.. టార్గెట్ ఫిక్స్



రామ్ చరణ్ తో సుకుమార్ సినిమా అంటే.. రంగస్థలం మూవీకి మించిన అంచనాలు కచ్చితంగా ఉంటాయి. ఇప్పుడు ఆ కాంబో మళ్లీ సెట్స్ పైకి వెళ్లేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. సినిమా ఎప్పుడు మొదలు పెట్టాలి, ఎప్పటిలోగా పూర్తి చేయాలి, ఎప్పుడు రిలీజ్ చేయాలనే విషయంలో కూడా సుకుమార్ క్లియర్ స్ట్రాటజీతో ముందుకు వెళ్తున్నారనే టాక్ వినిపిస్తోంది. పెద్ది తర్వాత చరణ్ చేస్తున్న ఆ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ గ్రాండ్ గా నిర్మిస్తోంది. అయితే రంగస్థలం తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో మొదటి నుంచే భారీ హైప్ ఉంది. ఇప్పుడు ఆ సినిమాకు సంబంధించిన లాంచింగ్ పై ఇన్ఫర్మేషన్ బయటకు వచ్చింది. దసరా సందర్భంగా ఈ నెల 16 నుంచి 20 మధ్యలో సినిమా పూజా కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. దసరాకు చరణ్- సుకుమార్ సినిమా అఫీషియల్ గా మొదలయ్యే ఛాన్స్ ఉందన్నమాట. అయితే దీనిపై మూవీ టీమ్ నుంచి అనౌన్స్మెంట్ రావాల్సి ఉంది. లాంచింగ్ తర్వాత కూడా ఎక్కువ గ్యాప్ తీసుకోకుండా రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టాలని సుకుమార్ భావిస్తున్నారట. డిసెంబర్ నుంచి షూటింగ్ ప్రారంభించి.. నాన్ స్టాప్ గా షూటింగ్ కంటిన్యూ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. దాదాపు ఏడాదిలో సినిమాను పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారట. ఇక డిసెంబర్ లో షూటింగ్ మొదలై ఏడాదిలోపే సినిమా పూర్తయితే.. 2028లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మంచి ఛాన్స్ ఉంటుంది. అందులో కూడా 2028 సంక్రాంతి లేదా సమ్మర్ ను టార్గెట్ గా పెట్టుకున్నట్లు టాలీవుడ్ లో చర్చ జరుగుతోంది. అంటే సినిమా లాంచింగ్ నుంచి రిలీజ్ వరకు ముందుగానే ఓ టైమ్ లైన్ పెట్టుకుని టీమ్ వర్క్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఆ ప్రాజెక్టుపై అంచనాలు పెరగడానికి మరో రీజన్ సుకుమార్ గత సినిమాలే. పుష్ప ఫ్రాంచైజీతో పాన్ ఇండియా రేంజ్ లో తన మార్క్ చూపించిన ఆయన.. ఇప్పుడు చరణ్ మూవీని ఎలాంటి స్టోరీతో రూపొందిస్తారనేది ఇంట్రెస్టింగ్ గా మారింది. రంగస్థలంలో చరణ్ ను పూర్తిగా కొత్త యాంగిల్ లో చూపించిన సుకుమార్.. ఈసారి కూడా అలాంటి కొత్త ట్రీట్మెంట్ తో వస్తారా అనే చర్చ జరుగుతోంది.